నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
ఆదివారం | 09 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com





ప్రాణాలు తీసే డంపింగ్ యార్డు మా ఊరిలో వద్దు



- అవసరమైతే ఎన్నికల్ని బహిష్కరిస్తాం • పోరాటాల పార్టీ ఎర్రజెండా మాకు అండ
- పంట పొలాలు...ప్రాణాలు పోయే చెత్త కుంపటి పెట్టొద్దు
- మా బతుకులు బుగ్గి చేసే 'రాంకీ' డౌన్ డౌన్
- మంచి టెక్నాలజీ అయితే పాత డంపింగ్ యార్డుల్లో పెట్టండి
- ఊరంతా వల్లకాడు చేస్తే చూస్తూ ఊరుకోం
- నిర్బంధం ప్రయోగిస్తే ఎంత వరకైనా పోరాడుతాం
- న్యాయమైన పోరాటానికి పోలీసులు సహకరించాలి
- ఊరంతా ఉద్యమిస్తాం...డంపింగ్ యార్డ్‌ను అడ్డుకుంటాం
- డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా సంఘటితమవుతున్న నల్లవల్లి-పారానగర్ ప్రజలు
- పోలీసుల నిర్బంధమున్నా ర్యాలీగా కదిలిన వేల మంది
- నల్లవల్లిని సందర్శించి మద్దతు పలికిన సీపీఐ(ఎం) నాయకుల బృందం



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

."ప్రాణాలు తీసి...పంట పొలాల్ని పాడు చేసి...ఊర్లను వల్లకాడు చేసే చెత్త కుంపటి మా ఊరిలో పెట్టొదంటూ బడి మానేసి పిల్లలు...పనులు మానేసి పెద్దలు ఊరంతా కూడలి వద్దే. ఒకటా రెండా పదమూడు గ్రామాల్లో... ఒకరా ఇద్దరా వేల మంది బతుకులు ఆగం కాబోతున్నాయన్న కన్నీటి ఆవేదన. మాకు మేలు చేయకపోయినా పర్వాలేదు. కానీ..! జీవితాల్నే బుగ్గి చేస్తామంటే చూస్తూ ఊరకోబోమంటూ కట్టలు తెంచుకునేంత ఆవేశం. పచ్చటి పంట పొలాలతో ప్రశాంతమైన పల్లెటూర్లలో పిల్లా జెల్లా... గొడ్డూ గోదాతో బతుకుతున్న ప్రజలపై పిడుగు పడిన చందంగా "చెత్త డంపింగ్ యార్డ్" వచ్చి పడింది. ఇంకేముంది సర్వశ్వం కోల్పోయే ప్రమాదాన్ని పారానగర్ ముంగిట్లోకి పాలకులు తెచ్చి పెట్టారు. ప్రమాదర రహితమంటూ అందమైన టెక్నాలజీ పేరు చెప్పి కార్పొరేట్ "రాంకీ" సంస్థ-జీహెచ్ఎంసీ-ప్రభుత్వం కలిసి వేలాది మంది ప్రజల జీవితాలతో చెలగాటమాడే కుట్రలు సాగుతున్నాయి. చావే ఖాయమని తెల్సాక ఇక తెగబడి తిరబగడక తప్పదు. ఐక్యంగా పోరాడేందుకు 13 గ్రామాల ప్రజలు సంఘటితమవుతున్నారు. న్యాయమైన ప్రజల పోరాటానికి ఎర్రజెండా పార్టీ సీపీఐ(ఎం) రంగంలోకి దిగింది. ఇతర రాజకీయ పార్టీలు సైతం చెత్త కుంపటి పెట్టొద్దని డిమాండ్ చేస్తున్నాయి. రాబోయే కాలంలో సమరశీలంగా పోరాడేందుకు శక్తిని కూడగట్టుకుంటూ మండల స్థాయిలో జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడ్డారు. అందరిదీ ఒకు గొంతుక, ఒకే నినాదం. "మా కొద్దు మాకొద్దు... పట్నం చెత్త మాకొద్దు. ప్రాణాలు పోయినా డంపింగ్ యార్డ్ పెట్టనీయం" అంటూ నల్లవల్లి, ప్యారానగర్, కొత్తపల్లి, లక్ష్మాపూర్, నాగిరెడ్డిగూడెం, మంబాపూర్, గుమ్మడిదల, బొంతపల్లి, వీరన్నగూడెం, దోమడుగు, అన్నారం, అనంతారం కానుకుంట, రామిరెడ్డిభాయి, వీరారెడ్డిపల్లి ప్రజలు ముక్త ఖంఠంగా డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ పోరాడుతున్నారు.

నల్లవల్లిలో కవాతు తొక్కిన ఊరి జనం

ఊరంతా పోలీసు బలగాలే. ఎటు చూసినా ఖాకీ బలగాల మోహరింపే. అయినా సరే కన్నతల్లి లాంటి ఊరిని, బువ్వపెట్టి బతుకునిచ్చే పొలాల్ని కాపాడుకునేందుకు నల్లవలి జనమంతా ఒక్కటయ్యారు. పొద్దునే కూడలి వద్ద గుమిగూడిన జనం మధ్యలోకి సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా నాయకుల బృందం వచ్చింది. దీంతో డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న నల్లవల్లి ప్రజలకు ఎర్రజెండా నాయకుల్ని చూడగానే కొండంత బలమొచ్చింది. ఇంకేముంది పదండి ముందుకు పదండీ అంటూ నల్లవల్లి ఊరి జనమంతా పోగయ్యారు. బడి మానేసిన పిల్లలు రేపటి మా భవిష్యత్‌ను నాసనం చేయొద్దంటూ ర్యాలీలో అగ్రభాగాన నడిచి నినదించారు. వయసుతో నిమిత్తం లేకుండా మహిళలు ఇంటి పనులు పక్కన పెట్టి కూడలి వద్దకు వచ్చారు. యువకులు, రైతులు, సకల జనులు ఒక్కటిగా కదలిలారు. ఊరిలోని సందు సందున ర్యాలీగా తిరుగుతూ ఊరి జనాల్ని పోరాటాలకు కదలిరావాలని కోరారు. ఆ ఇళ్ల ఈ ఇళ్ల అనేది లేదు. ఊరు ఊరంతా శివాజీ విగ్రహం వద్దకే వచ్చి చేరింది. అప్పటికే ఊరిలో ఊరి చుట్టు మోహరించిన పోలీసులు ప్రజల్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. డీఎస్పీ, సీఐ, పలువురు ఎస్ఐలు, కానిస్టేబుల్స్ అడ్డుతగిలినా వినకుండా ఊరి ప్రజలు ఐక్యంగా ర్యాలీ నిర్వహించారు. చిన్న పిల్లలు సైతం పిడికిలి బిగించి నినాదాలిస్తూ ర్యాలీలో ముందు భాగాన నడిచి ఇతరులకు స్ఫూర్తిగా నిలిచారు.

డంపింగ్ యార్డ్ రద్దయ్యే వరకు పోరాటం: సీపీఐ(ఎం)

ప్రజలతో కలిసి ఊరేగింపులో పాల్గొన్న సీపీఐ(ఎం) నాయకులు అనంతరం శివాజీ విగ్రహ సెంటర్‌లో నిర్వహించిన సభలో మాట్లాడారు. ముందుగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండానే ఏకపక్షంగా అధికారులు అన్ని రకాల అనుమతులు పొందామని చెప్పడం దుర్మార్గమైన చర్య అన్నారు. పచ్చటి పొలాల మధ్య చెత్త పోసి పొగపెడితే చుట్టుపక్కల ఊర్లన్నీ కాలుష్య కోరల్లో చిక్కుకుంటాయన్నారు. ఊరి కోసం రోడ్డేసేందుకు అనుమతులివ్వని అటవీ శాఖ డంపింగ్ యార్డ్‌కు మాత్రం చెట్టు నరికి రోడ్డేసేందుకు అనుమతులు ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు ఐక్యంగా పోరాడుదామని పిలుపు నిచ్చారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.రాజయ్య మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ పెడితే వాయు కాలుష్యం వల్ల మనుషులే కాదు జీవరాసులు సైతం అనారోగ్యాల పాలవుతాయన్నారు. పీల్చే గాలంతా కలుషితమవ్వడం వల్ల అనేక ప్రమాదకర వ్యాధులు ప్రబలుతాయన్నారు. చెత్త వ్యర్థపు నీరంతా చెర్వులు, కుంటల్లో చేరితే పంటలు పండే పరిస్థితి ఉండదన్నారు. భూ గర్భ జలాలు కలుషితమై వాడేందుకూ పనికిరావన్నారు. ఇతంటి ప్రమాదాన్ని తెచ్చి పెట్టే డంపింగ్ యార్డ్‌ను రద్దు చేసే వరకు ఏజేసీగా ఏర్పడి ప్రజలు పోరాడాలని పిలుపు నిచ్చారు. అనేక ఉద్యమాలు నడిపి విజయాలు సాధించిన చరిత్ర సీపీఐ(ఎం)కు ఉందన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్ మాట్లాడుతూ చట్టాలను ఉల్లంఘించి, ప్రజల అభిప్రాయాలతో సంబంధం లేకుండా డంపింగ్ యార్డ్ పెట్టడమనేది పూర్తిగా అప్రజాస్వామిక చర్య అన్నారు. చెత్త పొల్యూషన్ వల్ల ఈ ప్రాంతమంతా ఖాళీ చేసి పోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. ఇప్పటికే జవహర్‌నగర్‌లోని డంపింగ్ యార్డ్ వల్ల అక్కడ గడ్డిపరక కూడా మొలుస్తలేదన్నారు. అదే పరిస్థితి ఇక్కడ ఏర్పడితే 13 గ్రామాల ప్రజలు ఎక్కడికెళ్లి బతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పోలీసులు నిర్బంధం ప్రయోగించి భయభ్రాంతులకు గురి చేసినంత మాత్రాన పోరాటాలు ఆగవన్నారు. అనేక ఉద్యమాలు సైతం నిర్బంధాల్ని ఎదిరించే విజయాలు సాధించాయని గుర్తు చేశారు. ఆ పార్టీ జిల్లా కార్యదిర్శ వర్గ సభ్యులు ఎం.నర్సింహులు, జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వర్‌రావు, వాజీద్ అలీ మాట్లాడుతూ సీపీఐ(ఎం) ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. అన్ని గ్రామాల ప్రజలు ఐక్యంగా ఉద్యమిస్తే ప్రభుత్వం దిగిరాక తప్పదన్నారు.

నిర్బంధంలో నల్లవల్లి-ప్యారానగర్

చెత్త కుంపటి పెట్టి జనజీవనాన్ని అస్తవ్యస్థం చేసే డంపింగ్ యార్డును రద్దు చేయాలని పోరాడుతున్న ప్రజలపై నిర్బందం ప్రయోగిస్తున్నారు. ప్యారానగర్, నల్లవల్లి గ్రామాల చుట్టూ పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. వేలాది మంది పోలీసు బలగాలతో పహారా కాస్తూ అక్కడికి ఎవర్నీ అనుమితించట్లేదు. ఊరి ప్రజలు సైతం రాకపోకలు సాగించలేని భయానక పరిస్థితులున్నాయి. నల్లవలి, ప్యారానగర్ ఊరంతా పోలీసులతో నిండిపోయింది. గల్లీ గల్లీన పోలీసులు మాటు వేసి ప్రజల కదలికల్ని గమనిస్తూ నియంత్రిస్తున్నారు. ఎఎస్పీ, డీఎస్పీ, సీఐలు, పలువురు ఎస్ఐలు, కానిస్టేబుల్స్, స్పెషల్ పోలీసులు కలిసి ఊరి జనాల్ని కట్టడి చేస్తున్నారు.

దయచేసి ఆపండీ



అరుణ్, 8వ తరగతి, నల్లవల్లి

మా ఊర్లో డంపింగ్ యార్డ్ పెట్టొద్దు. దయచేసి ఆపండి. చెత్త వల్ల దుర్వాసన, కెమికల్స్ వస్తాయి. వాటి వల్ల కాలుష్యం పాడవుతుంది. మేమంతా కూరగాయలు పండిస్తం. మేం పండించినవే మీరు తిని బతుకుతుంద్రు. మా ఊరిలో చెత్త పోయొద్దు. పెద్దలంతా ఆలోచించాలి.

మభ్యపెడుతున్న అధికారులు



:అంజనేయులు, ఉద్యమ నాయకులు

పొల్యూషన్ రాని టెక్నాల జీని ఉపయోగిస్తున్నామని అధికారులు ప్రజల్ని మభ్యపెడుతున్నారు. అంత మంచి టెక్నాలజీని తెచ్చినట్లైతే దానిని ఇప్పటికే ఉన్న పాత డంపింగ్ యార్డులో పెట్టి అక్కడ సమస్యల్లేకుండా చేయండీ. మా ఊరికొచ్చి ఎందుకు పెట్టాలి. మాయ మాటలు చెప్పి ప్రజల్లో చీలిక తేవాలని చూస్తున్నారు. మేమంతా ఐక్యంగా ఉండి పోరాడుతాం. ఏజేసీగా అన్ని గ్రామాలు కలిసే ఉద్యమిస్తాం. డంపింగ్ యార్డ్ ముచ్చటే ఉండొద్దు. ఎంత వరకైనా పోరాడుతాం.

మా ప్రాణాలు పోతాయి



సాహితీ, విద్యార్థినీ, నల్లవల్లి

మాది పల్లెటూరు. ఇక్కడ డంపింగ్ యార్డ్ పెడ్తరంట. డంపింగ్ యార్డ్‌ను రద్దు చేసే వరకు ఇక్కడే కూర్చుటాం. డంపింగ్ యార్డ్ వల్ల పొల్యూషన్ ఏర్పడుతుంది. వ్యాధులు వస్తాయి. మేం చనిపోతాం. మా ప్రాణాలు తీసే చెత్త ఇక్కడ పోయొద్దు. పల్లెటూర్లన్నీ పాడవుతాయి. మేం పంటలు పండిస్తేనే కథా..! మీరు తినేది. మా ఊర్లు పాడైతే మేమంతా ఎక్కడికెళ్లాలి. ఇక్కడ చెత్త వేయకండీ.

యురోపియన్ టెక్నాలజీ



గంగాభవాణీ, తహసీల్దార్, గుమ్మడిదల

పదేళ్ల వివిద దేశాల్లో అధ్యయనాలు చేశారు. భారత దేశంలోనే తొలిసారిగా యూరోపియన్ టెక్నాలజీతో ప్యారానగర్‌లో జీహెచ్ఎంసీ అధికారులు డంపింగ్ యార్డ్ పెడుతున్నారు. దాని వల్ల ఏలాంటి పొల్యూషన్ ఉండదు. యార్డ్‌ను ఏర్పాటు చేసేందుకు రెండేళ్ల పడుతుంది. అప్పటి వరకు ప్రజలు పనులు మానుకొని పోరాడితే నష్టపోతారు. డంపింగ్ యార్డ్‌కు గ్రీన్ టిబ్యునల్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అనుమతులొచ్చాయి.

బలవంతంగా మా భూములు తీసుకోవద్దు

నవతెలంగాణ-జహీరాబాద్

నిమ్జ్ కోసం హుసేల్లి గ్రామంలో భూసేకరణకు వేసిన నోటిఫికేషన్‌కు శనివారం రోజున స్థానికులు తమ అభిప్రాయాలు తెలిపారు. నిమ్జ్ కోసం బలవంతంగా తమ భూమ లు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జహీరాబాద్ ఏరియా కార్యదర్శి బి.రాంచందర్ మాట్లాడుతూ.. హుసేల్లి గ్రామానికి చెందిన రైతులు తమ సారవంతమైన భూములను నిమ్జ్ కొసం ఇవ్వబోమని గత అనేక ఏండ్ల నుంచి పోరాడుతున్నారన్నారు. అధికారులకు, గత ప్రభుత్వాలకు ప్రస్తుత ప్రభుత్వనికి అనేక సార్లు విజ్ఞప్తి చేసినా.. రైతుల పక్షానకాకుండా ఏకపక్షంగా నోటిఫికేషన్ వేసి రైతులకు ఇబందులు కల్గించడం సరికాదన్నారు. వాణి జ్య పంటలు, ఆహార పంటలు, కూరగాయలు, పండ్ల తోట లు, పండే సారవంతమైన భూములను తీసుకోని పరిశ్రవ లు పెట్టడం న్యాయం కాదన్నారు. రైతులు స్వచ్ఛందంగా ముందుకు వస్తేనే భూములు తీసుకోవాలని.. లేని పక్షంలో రైతుల భూములను మినహాయింపు చేయాలని కోరారు. సీపీఐ(ఎం) ఎల్లవేళలా రైతుల పక్షాన నిలబడుతుందన్నారు. నిమ్జ్, ఆర్‌డీఓ కార్యాలయం పరిపాలన అధికారి వంశీ కృష్ణకు, జిల్లా కలెక్టర్, తహసీల్దార్, అధికారయంత్రంగానికి విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రాలు అందజే శారు. ఈ కార్య క్రమంలో రైతులు రాములు, శివరాజ్, రాజ కుమార్, మారు తీ, కాశినాథరెడ్డి, గుండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సొంతగూటికి చేరిన దేశెట్టి పాటిల్

ఎమ్మెల్యే మాణిక్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని గుంజేటి మాజీ ఎంపీటీసీ, నాయకులు బొమ్మ దేశెట్టి పాటిల్ తిరిగి సొంతగూటికి చేరారు. బీజేపీని వీడి స్థానిక ఎమ్మెల్యే మాణిక్‌రావు సమక్షంలో శనివారం పలువురు సన్నిహితులు, యువకులతో కలిసి తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. దేశెట్టి పాటిల్ ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడు తూ..మాజీ సీఎం కేసీఆర్ సమక్షంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కరెంటు, నీళ్లు, రైతులకు పంటకు మద్దతు ధర, కళ్యాణ లక్ష్మి లాంటి ఎన్నో బృహత్కర పథకాలతో ప్రజలకు మేలు జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్‌కు మంచి రోజులు వస్తాయని కార్యకర్తలు ధైర్యంగా ఉండాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఎమ్మెల్యేను అంతకుముందు దేశెట్టి పాటిల్ శాలువాతో ఘనంగా సన్మానించారు. అయితే పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ చేరికతో మండలంలో రాజకీయం వేడెక్కింది. పార్టీలో చేరిన వారిలో బొమ్మ దేశెట్టి పాటిల్, మరియంపూర్ లోకేష్, పట్లూర్ ప్రభాకర్, శీను పటేల్, మానేన్న, తుల్జారామ్, సిద్ధప్ప, శివన్న , జగనాథ్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు న్యామతబాద్ శ్రీకాంత్‌రెడ్డి, విష్ణు, సురేష్, విజయ్ తదితరులున్నారు.





స్కూటీని ఢీకొట్టిన లారీ, తండ్రి, కొడుకులు మృతి

చిన్న కుమారుడు విష్ణుకు తీవ్ర గాయాలు

నవతెలంగాణ-దౌల్తాబాద్

ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతున్న క్రమంలో లారీ ఢీకొని తండ్రి కొడుకులు మృతి చెందగా మరో కుమారునికి తీవ్ర గాయాలైన విషాదకర సంఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం చెట్ల నర్సంపల్లి చౌరస్తాలో శనివారం చోటు చేసుకుంది. రోడ్డు ప్రమాదంలో తండ్రి కొడుకులు మృతి చెందటంతో తిరుమలాపూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దౌల్తాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. దౌల్తాబాద్ మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన చిట్యాల వేణు గ్రామంలో టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల నూతనంగా కొనుగోలు చేసిన స్కూటీపై తన ఇద్దరు కుమారులు శివ, విష్ణులతో కలిసి వేణు మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం ధరిపల్లి గ్రామం అత్తగారింటికి తన స్కూటీపై బయలుదేరారు.దౌల్తాబాద్ మండలం ఇందు ప్రియాల్-చెట్ల నర్సంపల్లి గ్రామం వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో గజ్వేల్ నుంచి చేగుంట వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి స్కూటీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో చిట్యాల వేణు (38), పెద్ద కుమారుడు శివ (18) తండ్రి, కొడుకులు ఇద్దరు అక్కడిక్కడే మృతి చెందారు. చిన్న కుమారుడు చిట్యాల విష్ణు (14) కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని గాయాలైన విష్ణును గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. తండ్రి, కొడుకుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. చిట్యాల వేణుకు భార్య నాగలక్ష్మి ఉన్నారు. బంధువుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ తెలిపారు.







పెండింగ్ స్కాలర్షిప్స్ వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ-కొండాపూర్

పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్స్, రియంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ కొండాపూర్ మండల మహాసభలు శనివారం నిర్వహించారు. ఈ మహాసభలకు మహేష్ హాజరై మాట్లాడుతూ.. ఎస్ఎఫ్ఐ ఆవిర్భావం నుంచి నేటి వరకు నిత్యం విద్యార్థుల శ్రేయస్సు, భావి భారత పౌరుల భవిష్యత్తు కోసం కృషి చేస్తున్నదన్నారు. విద్యా వ్యతిరేక విధానాలపై, ఉచిత విద్యా అందరికీ సమానంగా అందే విధంగా నిరంతరం అలుపెరుగని పోరాటాలను ఉద్యమాలను నిర్వహించడంతో.. సంక్షేమ హాస్టల్స్‌లో మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచినట్టు గుర్తు చేశారు. కేంద్ర ప్రభు త్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంతో దేశ సమగ్రత సమైక్యత దెబ్బతీసే విధంగా ఉందన్నారు. ఇప్పటికైనా విద్యా వ్యతిరేక విధానాలు వదిలేసి దేశ విద్యాభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థులు పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం కొండాపూర్ మండలం (ఎస్ ఎఫ్ ఐ) నూతన కమిటీని 11 మందితో ఎన్నికున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వాణి, ఎస్ఎఫ్ఐ నూతన మండల అధ్యక్షుడు కార్యదర్శులు ప్రశాం త్, అర్జున్ ఉపాధ్యక్షుడు నితిన్,సహాయ కార్యదర్శి శ్రీశైలం, ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు సాయికుమార్, మాధురి శ్రీ, శ్రీజ, రుషిత, కమిటీని ప్రకటించారు.



ఉచిత శిక్షణ దరఖాస్తుకు నేడే చివరి తేది

నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్, సంగారెడ్డి ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సి మరియు బ్యాంకింగ్ రిక్రూట్ మెంట్ ఫౌండేషన్ కోర్స్‌లకు ఉచిత కోచింగ్ ఆన్‌లైన్ దరఖాస్తుకు నేడే చివరి తేదీ అని సంగారెడ్డి జిల్లా బీసీ స్టడీ సర్కిల్, డైరెక్టర్ టి.ప్రవీణ్ శనివారం ఒక ప్రకటనలో తెలి పారు. ఈ ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని ఈనెల 15 నుంచి 100 రోజుల పాటు నిర్వహించనున్నట్టు.. శిక్షణా సమయంలో 75శాతం హాజరైన అభ్యర్థులకు స్టైఫండ్ రూ.1500 ఇవ్వనున్నట్టు తెలిపారు. అర్హులైన సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ ఇతర అభ్యర్థులు ఆన్‌లైన్‌లో www.tgbcstudycircle.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థి తల్లితండ్రుల ఆదాయం సంవత్సరానికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షల లోపు, పట్టణ ప్రాం తాల్లో రూ.2లక్షల లోపు ఉండాలన్నారు. ఇంటర్మీడియట్ మరియు డిగ్రీ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఎంపిక ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 12 నుంచి 14 వరకు సర్టిఫికేట్ వేరిపికేషన్ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 08455-277015, 9949592991 నెంబర్‌లను లేదా సంగారెడ్డి బైపాస్ రోడ్డులో గల బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

108 వాహనంలో మహిళ ప్రసవం



తల్లీ బిడ్డా క్షేమం..

నవతెలంగాణ-పుల్కల్

పుల్కల్ మండలం పోచారం గ్రామానికి చెందిన సుకన్యకు శనివారం ఒక్కసారిగా పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్ పైలట్ దేవా గౌడ్, ఈయంటి వేణులు వెంటనే స్పందించి అక్కడికి వెళ్లి.. ఆసుపత్రికి తీసుకువస్తున్నారు. ఈ క్రమంలో మార్గ మధ్యలో పుల్కల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చే సరికి నొప్పులు ఎక్కువై పాపకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి కూతురు క్షేమంగా పుల్కల్ ఆసుపత్రిలో ఉన్నారు. సమయానికి స్పందించిన 108 వాహనం సిబ్బందిని సుకన్య కుటుంబ సభ్యులు అభినందించారు.

కాంగ్రెస్ డిఫీట్, కేసీఆర్ రిపీట్



ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

నవతెలంగాణ-సంగారెడ్డి

కాంగ్రెస్ డిఫీట్, కేసీఆర్ రిపీట్ అవుతుందని సంగారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు చింత ప్రభాకర్ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత మొదలైందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికలకు పోవాలన్నారు. తెలంగాణలో హామీలు అమలు చేయకుండా ఇతర రాష్ట్రాల్లో ప్రచారం చేసుకున్నంత మాత్రాన ఓట్లు పడవు అన్నారు. ఢిల్లీ ఫలితాల్లో కాంగ్రెస్‌కు గుండు సున్న వచ్చిందన్నారు. తెలంగాణలో కూడా కాంగ్రెస్ పాలనాలపై ప్రజలు గుస్సా మీద ఉన్నారన్నారు. గ్యారంటీలు అమలు చేయకుంటే కాంగ్రెస్ పార్టీని నిలదీసుడు ఖాయమన్నారు. మాట తప్పుడు మడమ తిప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటు అని దుయ్యబట్టారు. రైతు రుణమాఫీపై ఇప్పటి ప్రభుత్వానికి స్పష్టత లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ప్రజల తరుపున పోరాటం చేస్తామన్నారు.



అనాలోచిత విధానాలతో ప్రజలకు పరేషన్



మీ సేవా ద్వారా రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటన..

- ఉదయం 11 గంటలకే పోర్టల్ లాక్..
- దరఖాస్తు ఫారాలతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న జనం

నవతెలంగాణ-జహీరాబాద్

నూతన రేషన్ కార్డుల జారీ విషయమై అధికారులు, పాలకుల చేపడుతున్న అనాలోచిత విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే ప్రజా పాలనలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా కోసం అధికారులు ఇదివరకే దరఖాస్తులు స్వీకరించారు. దాంతో జిల్లాలోని వివిధ మండలాల నుండి లక్షల్లో దరఖాస్తులు రేషన్ కార్డుల కోసం, రేషన్ కార్డుల లోని పేర్ల మార్పులు చేర్పుల కోసం దరఖాస్తులు అందాయి.

ఒక జహీరాబాద్ నియోజకవర్గ నుండే 10 వేలకు పైగా నూతన రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా రేషన్‌కార్డుల కోసం మీ సేవలో దరఖాస్తులు చేసుకోవాలని శుక్రవారం రోజున ప్రభుత్వం నుంచి ప్రకటన వచ్చింది. మరోపక్క శనివారం ఉదయం 11 గంటలకే ఆ పోర్టల్ లాక్ చేయడంతో ప్రజలు దరఖాస్తు ఫారాలు పట్టుకొని మీసేవ కార్యాల యాల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికే ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రజలు ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాలకు వెళ్లి తమ దరఖాస్తు తిరిగి ఇవ్వాలని.. తాము మీ సేవలో దరఖాస్తులు చేసుకుం టామని చెప్తుండడంతో.. ఏమి సమాధానం చెప్పాలో తెలియక అధికారులు తలలు బాదుకుంటున్నారు. చివరికి మీసేవాలో దరఖాస్తు స్వీకరించే పోర్టల్‌ను లాక్ చేయడంతో దరఖాస్తుదారులు తిరిగి అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఒక జహీరాబాద్ మండలంలోని నూతన రేషన్ కార్డుల కోసం 3429 దరఖాస్తులు శనివారం వరకు వచ్చినట్లు అధికారులు తెలుతుచున్నారు. ఇదే మాదిరిగా మొగుడంపల్లి, కోహిర్, ఝరాసంఘం, న్యాలకల్ మండలాల్లో కూడా వేళల్లో దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే ప్రజాపాలనందు దరఖాస్తు స్వీకరించినటువంటి అధికారులు ఎంపీడీవో కార్యాలయం నందు, మున్సిపల్ కార్యాలయాలల్లో వాటిని భద్రపరిచారు. ఆ దరఖాస్తులను ఆన్లైన్లో నమోదు చేస్తారా, లేక విచారణ నిమిత్తం లిస్టులన్నింటినీ గ్రామాల వారీగా రెవెన్యూ అధికారులకు అప్పగిస్తారా అన్నది తేలాల్సి ఉంది. ఇప్పటికే గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులన్నింటిని గ్రామ సభలో చదివి వినిపించిన అనంతరమే.. వాటిని స్వీకరించి లబ్ధిదారు లుగా గుర్తించినట్టు కింది స్థాయి అధికారులు చెబుతున్నారు. కానీ రేషన్ కార్డులకు సంబంధించి ప్రభుత్వం నుండి నేటికీ స్పష్టమైన ఆదేశాలు లేకపోవడంతో.. వచ్చిన దరఖాస్తులన్నీ మున్సిపల్ మండల అభివృద్ధి కార్యాలయాల్లో మగ్గుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులకు ఏ విధమైన పరిష్కారం చూపుతారో తెలపాలని ప్రజలు కోరుతున్నారు.

రేషన్‌కార్డుల స్వీకరణ నిరంతర ప్రక్రియ

రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ. ఇప్పటికే వచ్చిన దరఖాస్తులకు సంబంధించి ఉన్నత అధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చిన వెంటనే చర్యలు చేపడతాం. ప్రజా పాలనలో ఇప్పటికే దరఖాస్తులు వచ్చాయి.. మళ్లీ మీ సేవలో దరఖాస్తు చేసుకుంటే విచారణలో ఇబ్బందులు జరుగుతాయి. 2 చోట్ల దరఖాస్తులు రావ డం తో ఇబ్బందులు వస్తాయన్న ఆలోచనతోనే మీ సేవలో పోర్టల్‌ను లాక్ చేశాం. ఎంపీడీవో కార్యాలయాల నుండి మున్సిపల్ కార్యాలయాలనుండి రేషన్‌కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులన్నింటిని లిస్టులు తయారు చేసేందుకు ఆదేశించాం.

– ఆర్డీవో రామ్‌రెడ్డి

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

నవతెలంగాణ-పుల్కల్

మండలంలోని ముదిమాణిక్యం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరిపారు. విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా ప్రవళిక, డీఈవోగా సానియా, ప్రధానోపాధ్యాయురాలుగా అఖిల, ఆర్జేడిగా జస్వంత్, ఎంఈఓగా మహేశ్వరి, డిప్యూటీ కలెక్టర్‌గా శివ ప్రసాద్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మెన్‌గా సృజన్ పాల్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయురాలుగా పి జస్వంత్, సోనీ, సంధ్య వ్యహరించి.. విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతన ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి శంకర్ హాజరు కాగా.. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



సీఐటీయూలో చేరిన ఆటో కార్మికులు

నవతెలంగాణ-కంగ్టి

మండలకేంద్రమైన కంగ్టిలోని ఆటోడ్రైవర్లు శనివారం సీఐటీయూ యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఏరియా కార్యదర్శి నల్లవెల్లి రమేష్ మాట్లాడుతూ.. రవాణ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని.. ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12,000 ఇస్తామన్న హామీని అమలు చేయాలన్నారు. జిల్లాలో ట్రాఫిక్ పోలీస్‌లు.. ఆటోలపై టాప్ నెంబర్‌లు లేవని చేస్తున్న దాడులు ఆపాలన్నారు. ఆటోలు నిలపడానికి ఆటో అడ్డాలు, విశ్రాంతి కోసం భవనం ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ వ్యాప్తంగా రవాణ రంగంపై ఆధారపడి లక్షల కుటుంబాలు ఉన్నాయని.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రీ బస్ ప్రయాణం పేరుతో ఆటో కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం రవాణారంగ కార్మికుల సంక్షేమ చట్టం చేయాలని.. వారికి ప్రత్యామ్నయ మార్గం చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ నాయకులు సతీష్, మండల నాయకులు శివరాజ్, ఆటో కార్మికులు సోపాన్, సిమన్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా మల్లన్న స్వామి జాతర

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీలో మల్లన్న స్వామి జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల రెండోరోజు శనివారం గంగా పటం కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తలు వి.నారా యణ రెడ్డి, వి.చంద్రారెడ్డి, వి.మాధవ రెడ్డి, వి.హనుమంత్ రెడ్డి, వి.రాజేందర్ రెడ్డి, వి.యాదిరెడ్డి, వి.వరప్రసాద్ రెడ్డి, వి.ప్రవీణ్ రెడ్డి, వి.విష్ణువర్దన్ రెడ్డి, వి.మధుసూదన్ రెడ్డి, వి.మాసంత్ రెడ్డి, వి.ప్రణీత్ మల్లా రెడ్డి తదితరులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ఉత్సవాలతో పారిశ్రామికవాడలో ఆధ్యాత్మిక వాతావరణం చోటుచేసుకుంది. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్మికులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



జాతరలో పశువుల సంతకు అంతా సిద్ధం

ఘనంగా జరగనున్న ఉత్సవాలు
జాతరకు హాజరుకానున్న ఎంపీ

నవతెలంగాణ-న్యాల్‌కల్

న్యాల్‌కల్ పీర్ గైబ్ సాహెబ్ దర్గా ఉత్సవాలకు అంతా సిద్ధమైంది. నేడు పశువుల సంతతో జాతర ప్రారంభమై ఘనంగా సాగనున్నదని నిర్వాహకులు చెబుతున్నారు. నేటి మధ్యాహ్నం 2 రెండు గంటలకు జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కర్ దర్గాకు హాజరుకా నున్నట్టు చెప్పారు. అయితే జాతరలో భాగంగా శనివారం చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పద్దె ఎత్తున దర్గాకు వచ్చి.. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాగా నేడు(ఆదివారం) పశువుల సంత హద్నూర్ నుండి దర్గా గంధం సమర్పించు రాత్రి ఖవాలి, సోమవారం న్యాల్‌కల్ గ్రామ నుంచి ఖురేషి వారి గంధం ఊరేగింపు, మంగళవారం అంత రాష్ట్ర పైల్వాన్ కుస్తీ పోటీలు జరగనున్నాయని ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఎండి. యూనుస్ ఖాన్ తెలిపారు. కాగా పశువుల సంతకు లక్షల విలువైన మేలైన పశువులు నలుమూలల నుంచి తరలివస్తాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మేలైన పశువులకు హెూతి అడివప్ప గిరిజమ్మ జ్ఞాపకార్థం బహుమతులు అందజేయన న్నారు. జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు, ఎస్సై చల్ల రాజశేఖర్ జాతరలో ప్రజలకు ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రత చర్యలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో దర్గా సేవ కుడు మక్సుద్ అలీ, అధ్యక్షులు యూనుస్ ఖాన్, కమిటీ సభ్యులు అబ్దుల్ వాహబ్, గొల్ల నర్సింలు, సయ్యద్ హైమద్, నిర్వాహకులు భక్తులు ఉన్నారు.

తెలంగాణ డాక్టర్స్ క్రికెట్ లీగ్ ప్రారంభం

నవతెలంగాణ-సంగారెడ్డి

అవయవ దానంపై అవగాహనలో భాగంగా సంగారెడ్డిలో తెలంగాణ డాక్టర్స్ క్రికెట్ లీగ్-2025 ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఐఎంఏ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి క్రికెట్‌లీగ్‌ను ఐఎంఏ సెక్రెటరీ డాక్టర్ ఆనంద్ నిర్వహణలో గుడితాండాలోని గగన్‌స్పోర్ట్స్ గ్రౌండ్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీఎస్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేనారెడ్డి, టీజీ ఐఐసి చైర్మెన్ నిర్మల జగ్గారెడ్డి, ఐఎంఏ స్టేట్ ప్రెసిడెంట్ కిషన్ కార్యదర్శి అశోక్, ఐఎంఏ స్పోర్ట్స్ కమిటీ చైర్మెన్ పుల్లారావులు శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని దానాల్లోకెల్లా అవయవదానం గొప్పదన్నారు. 'అవయవ దానం చేయం డి మరణం తర్వాత జీవించండి' అనే నినాదంతో



ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. అవయవ దానం చేస్తే ఇతరులకు పునః జీవితం ఇచ్చిన వాళ్ళం అవుతామన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ కిరణ్, సీనియర్ డాక్టర్లు శ్రీధర్ సురేష్, ఐఎంఏ అసోసియేషన్ సభ్యులు, ఇతర డాక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్స వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-సదాశివపేట

పట్టణంలోని హట్కర్‌పేటలో వెలసిన శ్రీ రామలింగ చౌడేశ్వరిమత మందిరం 26వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం సమాజ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయంలో గోపూజ, ధ్వజారోహణం నిర్వహించి, పట్టణ పురవీధుల గుండా అమ్మవారి ఆభరణాలు ఊరేగింపుతో పాటు మహిళలతో కలశాలు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం తంగడపల్లి ఆశ్రమ





అప్పా శ్రీశ్రీశ్రీ శివయోగి శివాచార్యుల పాదపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కోడూరి రమేష్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ శ్రీధర్ రెడ్డి, నాయకులు నాగుల విజయ్, బరాడి శివ, సమాజ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా సాగిన ఆటో ఎక్స్ పో

- తరలి వచ్చిన అత్యాధునిక దేశ విదేశీ కార్లు, బైకులు..సీఆర్ పీఎఫ్ వాహనాలు

నవతెలంగాణ-పటాన్‌చెరు

హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రమాణ – 2025 రెండో రోజైన శనివారం ఎలక్ట్రిఫైయింగ్ ఆటో ఎక్స్‌పో- ఆటోమే నియాతో ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో నగర నలుమూలల నుంచి తరలి వచ్చిన ఆటోమొబైల్ ఔత్సాహికులతో పాటు విద్యార్థులనూ ఆకర్షించింది. ఆటోమోటివ్ పరిశ్రమలో అత్యాధునిక ఆవిష్కరణలను చూడటానికి ఆసక్తిగా ఉంది. ఈ ఆటో ఎక్స్‌పోకి, సెంట్రల్ రిజర్వు పోలీసు దళం (సీఆర్ పీఎఫ్) వారు ప్రదర్శించిన అత్యాధునిక సాయుధ వాహనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ భారీ వాహనం పేలుళ్ల, ల్యాండ్ మైన్ల నుంచి కాపాడుకోగలిగే విధంగా రూపొందించారు. వజ్ర, మినీ వజ్ర వాహనాలతో కూడిన మాక్ డ్రిల్ ప్రేక్షకులను మరింత ఆకర్షించింది. ఈ ఆటో ఎక్స్‌పోను మించి. ప్రమాణ – 2025 సాంకేతిక, సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులను ఉర్రూత లూగించింది. టెక్ అవగాహన ఉన్న విద్యార్థులు





హ్యాకథాన్లు, సాఫ్ట్ వేర్- హార్డ్ వేర్ ప్రాజెక్టు ఎక్స్ పోలలో పాల్గొనగా, సాంస్కృతిక ఔత్సాహికులు ఆకట్టుకునే మాటలు, పొట్టి చిత్రాల పోటీలు, శాస్త్ర ప్రదర్శనలు, ఫ్రీస్టైల్‌రాప్ బాటిల్స్, డీజే పోటీలలో పాల్గొన్నారు. ఇవే కాక, విద్యార్థు లతో ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్న బ్యాటిల్ ఆఫ్ బ్యాండ్స్, మిస్టర్ అండ్ మిసె ప్రమాణ పోటీల్లో విరివిగా పాల్గొనారు. సినిమాటిక్ మేకప్, స్ప్రే పెయింట్ ఆర్ట్, స్లిమ్ మేకింగ్, ఎమర్జెన్సీ ఇంపాక్ట్ వంటి వాటిలో శిక్షణ కోసం ఈ సందర్భంగా పలు ఆకర్షణీయమైన కార్యశాలలు నిర్వహిం చారు. ప్రమాణ రెండోరోజు, అత్యుత్తమ క్షణాలలో ఒకటిగా నిలిచిన 9టీన్, వర్ధం బ్యాండ్‌ల హై-ఎనర్జీ ప్రదర్శన విద్యా ర్థుల ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. ఇక ఆత్మవిశ్వాసం, గాంభీర్యం, ఆకర్షణలను ప్రదర్శించే అద్భుతమైన ర్యాంప్ వాక్, వేదిక అంటే సహజంగా ఉండే భయాన్ని పోగొట్ట డంలో తోడ్పడడమే గాక, ఉత్సాహభరితమైన జనసమూ హం ముందు విద్యార్థులలో అంతర్లీనంగా ఉన్న ప్రతిభను ప్రదర్శించేలా ప్రోత్సహించింది. ఈ వేడుకలు మూడో రోజైన ఆదివారం నిర్వహించే ప్రపంచ ప్రసిద్ధ జూలియా బ్లిస్, పీఆర్ వో బ్రదర్స్ అద్భుతమైన ఈడీఎం-డీజే నైట్ తో ముగియనుంది.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

నవతెలంగాణ-సంగారెడ్డి

మండలంలోని కల్పగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకొని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని, సమాజంలో మంచి పేరు సంపాదించుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రామకృష్ణ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, విరాజ్ రెడ్డి, వీణకుమారి, పవన్ జీత్ కౌర్, శైలజ,



ఆఫీస్ సిబ్బంది హమీద, ప్రవీణ్, రాహుల్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా భవాని మాత ఆలయ జాతర

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని రత్నాపూర్‌లో గల భవాని మాత ఆలయ జాతర వైభవంగా కొనసాగుతున్నది. సమీప గ్రామలతో పాటుగా కర్ణాటక సరిహద్దు ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కాగా ఈనెల 11వ తేదీ వరకు జాతర వేడుకలు జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నేడు(ఆదివారం) రత్నాపూర్ జాతర వేడుకలో జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పర్యటన పాల్గొంటారని ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ నాయకులు శాంత్ కుమార్ పాటిల్ తెలిపారు.



సీసీరోడ్ల నిర్మాణ పనుల పరిశీలన

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ మున్సిపాల్టీలో గల సాయిబాబా గుడి పక్కన జరుగుతున్న సీసీరోడ్డు పనులను మాజీ వైస్ చైర్మెన్ దారం శంకర్ సేటు శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సహకారంతో మున్సిపాల్టీకి రూ.20 కోట్లతో గతంలో శంకుస్థాపనలు చేయ గా.. ఆ పనులను పూర్తి చేయుటకు కాంట్రాక్టర్‌తో చర్చించారు. నారాయ ణఖేడ్ మున్సిపాల్టీ అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు.ఈ కార్యక్ర మంలో మాజీ కౌన్సిలర్లు రాజేష్, నర్సింలు, మాజీ ఎంపీటీసీ పండరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్వయం పాలనా దినోత్సవం

నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట పట్టణంలోని కేంబ్రిడ్జ్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. విద్యార్థులు అధికారులుగా, ఉపాధ్యాయులుగా చక్కగా వ్యవహరించారు. విద్యాశాఖమంత్రిగా హరిప్రియ, ఎంపీగా నందమోహన్, ఎమ్మెల్యేగా వరుణ్, జిల్లా కలెక్టర్గా శరణ్య, జిల్లా విద్యాధికారిగా స్పందన, మండల విద్యాధికారిగా ఐశ్వర్య, ప్రిన్సిపల్ గా వేద శ్రీ, ఉపాధ్యాయులుగా శ్రీ తీత, సహస్ర, వైష్ణవి, భూరాణా, పీఈ టిగా కమల్, రేవంత్ వ్యవహరించారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మణ రావు, డైరెక్టర్ గోపాల్‌రెడ్డి అభినందించారు.

IN THE COURT OF THE HON'BLE PRL. JUINOR CIVIL JUDGE- SANGAREDDY DISTAT: SANGAREDDY

O.S.NO. 123 OF 2021

Between:
P.Narsimha Reddy
.........Plaintiff
And
P.Goverdhan Reddy & another
..........Defendants

To,
NarayanagariNagavender Reddy S/o. N.Venkat Reddy, Aged 43 Years, Occ. Contributor, R/o. Flat. No.105, Gaythri Residency, Madhavapuri Hills,Ameenpur Village& Mandal, Sangareddy Disrtict.
.............(Defendant No. 2)

Whereas the plaintiff's have filed the above suit for Perpetual Injuction against you vide. O.S.No.123 of 2021. You are hereby summoned to appear in this court, in person or by a pleader on 3-03-2025 at 10:30.A.M Including answer the same, failing which the matter will be decided ex-parte.

(BY ORDER OF THE COURT)
Middhinti Srinivas
(Advocate)
Sangareddy District
Counsel for the Plaintiff

IN THE COURT OF THE HON'BLE PRL JUNIOR CIVIL JUDGE, AT: SANGAREDDY EP.NO. 25 OF 2022 IN OS.NO. 374 OF 2019

Between:
Smt.Aruna Jyothi
...Decree Holder
AND
M.Neelammma and others
...Judgment debtors

NOTICE

To,
1.M.Neelamma W/o.M.Chandraiah Age: 47 years, Occ: Housewife,
2.M.Chandraiah S/o.M.Laxmaiah Age: 55 years, Occ: Agri,
Both are R/o. Kondapur Village and Mandal, Sangareddy District

It is hereby informed that the above decree holders have filed an execution petition under Order XXI Rule 34 of CPC against you both in the above court and the same is stand posted to 24/02/2025 at 10.30 AM for your appearance. If you fail to appear before the Court on the said date, the matter will be decided Ex-parte.

// BY ORDER OF THE COURT//
Amboori Krishna Rao
Advocate
Hyderabad +91-9866065648.

IN THE COURT OF THE HON'BLEIV ADDITIONAL DISTRICTJUDGE AT: SANGAREDDY

M.V.O.P.NO. 86OF 2023

Between:
Sri. G. Lokesh
.....Claimant
AND
Sri. Srikanth &other,
.....Respondents

NOTICE

To
1. Sri. Srinivasa Rao Krothapalli S/o. Krishna Rao,R/o, 23-100, Road No.2 Opp. Sri Residency,Ashok Nagar, Sangareddy District.
....Respondent No.2

Whereas,the Claimantfiled the above petitionby claiming compensationon road accidentagainst Respondent No. 2 along with 2 others. The above case is posted on 28-03-2025 at 10:30 AM., for your appearance is required. On the said date and time you should appear in the said courteither in person or through Advocate if you fail to appear before above said court in any reasons the suit shall be decreed Ex-parte.

//BY ORDER OF THE COURT//
M. Govardhan
Advocate
Sangareddy District
Cell: 9849383488

IN THE COURT OF HON'BLE SEPCIAL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS (MOBILE) FOR TRIAL OF CASES UNDER PCR ACT- CUM-II ADDITIONAL JUNIOR CIVIL JUDGE, SANGAREDDY DISTRICT. AT: SANGAREDDY. OS.NO. 917 OF 2024.

Between:-
1) Aktar Unnisa Begum W/o.Late Syed Latheef Ahmed, Aged 78 years, Occ: Household, Aadhar no. 8027 5452 0921.
2)Syed Shabbir Ahmed S/o.Late Syed Latheef Ahmed, Aged about 60 years, Occ: Business, Aadhar no.4373 9713 5846.
3)Syed Javeed S/o.Late Syed Latheef Ahmed, Aged about 51yrs, Occ: Business, Aadhar no.5971 6979 3644.
4) Mujeeb Unnisa D/o.Late Syed Latheef Ahmed, W/o.Md.Samiulla Aged about 44 years, Occ: Household, R/o.H.No.7-1-307/17/A Subash Nagar, Sanathnagar, Hyderabad, T.S-500018. Aadhar no. 2729 4610 7466.
5)Sami Syed S/o.Late Syed Latheef @ Syed Latheef Ahmed, Aged about 47 years, Occ: Business, R/o.AmrutDham CHS 301, Plot no.8, Sector 29C, Rabale Airoli, Thane, Ghansoli, Thane, Maharastra. Aadhar no. 4762 9209 8201.
6)Syeda Masarrath Jahan@ Syed Masarrath Jahan, D/o.Late Syed Latheef Ahmed, Aged about 35yrs, Occ: Housewife, Aadhar no. 8343 7020 7172.
Allfrom 1, 2, 3 and 6 are R/o. H.No. 4-23, Market Road, Near Water Tank, Patancheru Mandal, Patancheru, Sangareedy District, Telangana State-502319.
...Plaintiffsno.1 to 6
AND
1.The Tahsildar/MRO Patancheru, Patancheru Mandal, Sangareddy District, Telangana State.
2.To All Concern
...Defendants no.1& 2

TO,
All Concerned,
Take the notice that, the above Plaintiffs are filed the above Suit for Declaring Plaintiffs as Legal Heirs of Late Syed Latheef Ahmed, against all concerned and the matter is posted on 12-03-2025 for appearance and counter, if any. Hence if any person/s are having any objections/claims of whatsoever they may appear before the court of HON'BLE SEPCIAL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS (MOBILE) FOR TRIAL OF CASES UNDER PCR ACT- CUM-II ADDITIONAL JUNIOR CIVIL JUDGE, SANGAREDDY DISTRICT, AT: SANGAREDDY, on 12-03-2025 at 10.30 AM. Either in person or through an advocate, duly instructed by the person having objection. Failing which the matter will be decided on merits in exparte.

//BY ORDER OF THE COURT//
Sd/-
M/s.P.DEVENDER & ASSOCIATES
Advocates
Office at: SRT-733, Sanathnagar, Hyderabad-18.
M.No.9000542458.
Counsel for the Plaintiffs

IN THE COURT THE HON'BLE PRL JUNIOR CIVIL JUDGE -CUM-JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, AT SANGAREDDY

O.S. 1019 OF 2022

Between :
1.Smt. Imtiyaz Begum W/o Md.Haneef Miya, Aged about 47 years, Occ: Household, R/o. H.No. 2-3-46/2, Pittalkeri, Sadasivpet Town & Mandal, Sangareddy District.
2.Smt. Zaheda Begum W/O Mohammed Shamshuddin, Aged about 46 years, Occ: Household, R/o. H.No. 1-12-12/3, Jambikunta, Medak Town & Mandal District.
3. Farida Begum W/o Mohd. Salauddin, Aged about 31 years,Sangareddy Town, Mandal and District.
4. Mohammed Rafi S/o. Late Mohd. Yousuf, Aged about 29 years, Occ: Business, R/o. 9-11-92/A, Bada Bazar, Golkonda Fort, Hyderabad.
.... Petitioners/ Plaintiffs
AND
1. Mohammed Arif S/O Late Mohammed Yousuf, Aged about 50 years, Occ: Agriculture & Business, R/o. H.No.1-3-29/L/36, Ram Nagar, Medak Town, Mandal and District.
2. Shaik Ismail S/O. Late Mohd Yousuf, Aged about 45 years, Occ: Business, R/o. H.No. 2-1-23/33, Gollakeri, Sadasivpet Town & Mandal, Sangareddy District.
3. Abdul Haleem S/o Mohd. Nemathullah, Aged about 55 years,
4. Abdul Hakeem S/o Mohd. Nemathullah, Aged about 50 years,
5. Abdul Saleem S/o Mohd. Nemathullah, Aged about 40 years, D.3 to D.5 are R/o. Chinthalcheruvu Village, Hathnoora Mandal, Sangareddy District.
6. Sailu S/O. Boomaiah, Aged about 60 years, Occ: Agrl.R/O. Chinthalcheruvu Village, Hathnoora Mandal, Sangareddy District.
7. Ishrath Rahman W/O. Vali- ur-Rahman, Aged about 49 years, Occ: Household, R/O. H.No. 1-36/2/3/2, Jawahar Colony, Chanda Nagar, Hyderabad.
8. Palavai Srinivas S/O. Hanumantha Rao, Aged about 50 years, Occ: Business, R/O. H.No. 11-13-753 Green Hills Colony, Road No.3/D, Kothapet, Hyderabad.
9. Tellapuram Padma W/O Lingamaiah, Aged about 57 years, Occ: Household, R/o. LIG 986, BHEL, Bharathi Nagar, Hyderabad.
10. V.Koteshwar Rao S/o. Late V.Ramaiah, Aged about 52 years, Occ: Medical Practitioner, R/o. H.No. 1-2-31/6, Nizampet Road, Hyderabad.
11. Jahangeer SAB s/O. Yaseen, Aged about 85 years, Occ: Nill, R/o. Chinthalcheruvu Village, Hathnoora Mandal, Sangareddy District.
12. P.Mahipal Reddy S/O. Malla Reddy, Aged About 55 years, Occ: Employee, R/o. Qr.No.2035-A,BHEL, Township, Hyderabad.
13. K.Ranga Reddy S/O. Malla Reedy, Aged about 73 years, Occ: Retd. Employee, R/o. HIG 198BHEL, Ramchandrapuram, Hyderabad.
.... Respondents/ Defendants

Please take notice that the Plaintiffs herein had filed a suit for partition and separate possession U/s 26. Or. VII.Rules 1&2 C.P.C against Defendant No.1 to 13 and you Defendant No. 3 to 6 & you Defendant No.11 before the HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE-Cum- JUDICIAL MAGISTRATE OF FIRST CLASS AT SANGAREDDY , and same is posted on 17.02.2025 at 10:30 AM for your appearance,

Therefore, you Defendant No.3 to 6 and Defendant No.11 are hereby directed to appear before the above mentioned Hon'ble court at 10:30 AM on 17.02.2025 either personally or through your counsel to defend the same, otherwise the matter will be decided by the court of law basing on the material available and according to the law.

//By order of the Hon'ble court//
Sd/-
M/s THAYAL ASSOCIATES
T.FAZAL -UR-RAHMAN
ADVOCATE
H.NO: 2033,MIG Colony, Phase-1,BHEL,R.C.Puram, Hyderabad-502032

ఉన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం



నవతెలంగాణ-మనోహరాబాద్
మనోహరాబాద్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి స్వయంపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మనోహరబాద్ నందు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో 10వ తరగతి చదివే విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి మిగతా విద్యార్థులకు పాఠాలు బోధించారు. దీనిలో భాగంగా డీఈవోగా జి వేణు, ఎంఈఓగా వైష్ణవ ప్రధానోపాధ్యాయులుగా రుషికలు వ్యవహరించారు. చక్కగా బోధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు ఎం కృపాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్ప్ డెస్క్ ద్వారా ప్రజావాణి ధరఖాస్తుల స్వీకరణ



నవతెలంగాణ- మెదక్
వివిధ శాఖల అధికారులు ఎమ్మెల్సీ ఎన్నికల విధులు ఉన్నందున సోమవారం కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్ ద్వారా ప్రజావాణి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. అధికారులు ప్రజా వాణికి అందుబాటులో ఉండరని తెలిపారు. ప్రజలందరూ సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌లో ప్రజావాణి దరఖాస్తులు అందజేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించి సహకరించాలన్నారు.

కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలను సవరించాలి

- కార్పొరేట్స్‌కు అనుకూల బడ్జెట్ కాదు
- కార్మికులకు అనుకూల బడ్జెట్ ఉండాలి.
- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద జరిగే మహా ధర్నాను విజయవంతం చేయండి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు



నవతెలంగాణ- మెదక్
పార్లమెంట్లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ను సవరించాలని, ఈ బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్స్ కు అనుకూలంగా ఉందని, పేదలకు, కార్మికులకు, రైతులకు అభివృద్ధి పరిచే విధంగా లేదని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. మెదక్ పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో శనివారం పార్టీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .కేంద్రంలో ఉన్న బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం 2025-2026 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిందన్నారు. ఈ బడ్జెట్ ప్రతిపాదనలు కేటాయింపులు చూస్తే దేశంలో కార్పొరేట్లకు లాభాలు ఇస్తూ, కార్మిక వర్గానికి, రైతంగానికి, సాధారణ ప్రజలకు నష్టం చేసే పద్ధతిలో ఈ బడ్జెట్ ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు . కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వడం ద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, మన దేశంలో అంతర్గత మార్కెట్ బలపడే అవకాశం ఉంటుందని, సరుకులకు గిరాకీ పెరిగే అవకాశం ఉంటుందని, ద్రవోల్బణం కట్టడి చేసే అవకాశం ఉంటుందన్నారు. అనేక సదుపాయాలు ఉన్నప్పటికీ కార్మికుల వేతనాలను కేంద్ర ప్రభుత్వం పెంచడానికి సిద్ధంగా లేదన్నారు. రైతులకు ఇవ్వాల్సిన సబ్సిడీల మీద, ఎరువుల మీద కోతలు పెట్టే పరిస్థితి ఉందన్నారు. రైతు ఆత్మీయ భరోసా పేరుతో ఉపాధి హామీ పథకానికి లింకు చేసి, ఎక్కువ మందికి సహాయం చేయాల్సి వస్తుందని ఉపాధి హామీ పథకంలోని జాబ్ కార్డ్ లను ప్రభుత్వం ఆన్లైన్లో లాక్ చేయడం ప్రభుత్వ చిత్త శుద్ధికి నిదర్శనమన్నారు. దీంతో ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పని దినాలు పెంచాలని, కూలీలకు 8000 వేతనం ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పనిని పట్టణ ప్రాంతానికి విస్తరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఇప్పుడు ఏప్రిల్ నుంచి లేబర్ కోడ్స్‌ను అమలు చేస్తామని చెప్పి కార్మికుల హక్కులను కాలరాసే పద్ధతి ప్రభుత్వం లో కనబడుతుందన్నారు. తలసరి ఆదాయం తక్కువ ఉన్నటువంటి మన దేశంలో జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే ప్రజల ఆదాయాలు పెరిగే పద్ధతులను ప్రభుత్వం ఆలోచించాలన్నారు. బడ్జెట్ ప్రతిప్రాదనల్ని సవరించాలని, పేదలకు అనుకూలంగా ఉండే బడ్జెట్ గా ప్రతిప్రాదనల్ని సవరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 10వ తేదీన హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మహా ధర్నాను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ధర్నాలో ప్రజా సంఘాల కార్యకర్తలు పెద్ద ఎత్తున కదలి వచ్చి మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మెదక్ జిల్లా కార్యదర్శి కడారి నర్సమ్మ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏ. మల్లేశం, బసవరాజు, కే. మల్లేశం, బాలమణి, జిల్లా కమిటీ సభ్యులు బాగయ్య, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రేణుకాదేవి వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ-హవేలీ ఘనపురం
మండలం కుచన్ పల్లి గ్రామంలోని శ్రీ మాత రేణుకాదేవి ఆలయ వార్షికోత్సవం ఆదివారం నుంచి మూడు రోజుల పాటు వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు గౌడ సంఘం నేతలు అన్ని ఏర్పాట్లు చేశారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మొదటి రోజు సుప్రభాతం, దీపారాధన గణపతిపూజ, మహాభిషేకము, అలంకరణ, మంగళహారతి, మంత్రపుష్పంతో పాటు గ్రామదేవతలకు బోనాల ఊరేగింపు జరుపుతారు. సోమవారం శ్రీ రేణుకాదేవి కళ్యాణంతో పాటు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పణ, తీర్థ ప్రసాద వితరణ, అన్నదానం జరిపేందుకు గౌడ సంఘం నేతలు ఏర్పాట్లు చేశారు. బుధవారం శ్రీ రేణుకమాత (ఎల్లమ్మ)బోనాలు ఊరేగింపు జరుపుతున్నారు. మూడురోజుల వేడుకలకు హవేలి ఘనపూర్ మండలంలోని ఆయా గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గౌడ సంఘం ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు.

సాఫ్ట్వేర్ శ్రవణ్ కుమార్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- హవేలీ ఘనపూర్ ఎంఈఓ మధుమోహన్




నవతెలంగాణ-హవేలీ ఘనపూర్
విద్యార్థులు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగిన సాఫ్ట్వేర్ శ్రవణ్ కుమార్‌ను ఆదర్శంగా తీసుకోవాలని హవేలీ ఘనపూర్ మండల విద్యాధికారి మధుమోహన్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కూచన్ పల్లి పాఠశాల పూర్వ విద్యార్థి సాఫ్ట్వేర్ ఇంజనీర్ పంతులు శ్రవణ్ కుమార్ 105 మంది 10వ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ ,పెన్నులను అందజేశారు. పాఠశాల గ్రంథాలయ పుస్తకములు, గ్రంథాలయ అభివృద్ధి కోసం రూ.31వేలు విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా హవేలీ ఘనపూర్ ఎంఈఓ మధుమోహన్ మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థి అయిన శ్రవణ్ కుమార్ ఆదర్శంగా తీసుకొని విద్యార్థులందరూ బాగా కష్టపడి పట్టుదలతో వారు అనుకున్న లక్ష్యాలను సాధించుకొని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివరాజ్, శ్రవణ్ కుమార్, శాలువాతో సత్కరించారు.

వేల్పుగొండలో నేటి నుంచజ శ్రీ తుంబురేశ్వర స్వామి ఉత్సవాలు



నవతెలంగాణ-టేక్మాల్
టేక్మాల్ మండలం వేల్పుగొండ గ్రామంలోని కాకతీయుల కాలంలో నిర్మించిన శ్రీ తుంబురీశ్వర స్వామి ఉత్సవాలు ఈ నెల 9వ తేది నుంచి 12వ తేదీ వరకు స్వామి వారి ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందని ఆలయ పూజారి రవి కోటి వైద్య రామశర్మ తెలిపారు. ఈ ఉత్సవాలను శ్రీ మదనానంద స్వామి వారి దివ్య ఆశీస్సులతో నిర్వహించడం జరుగుతుందన్నారు. శ్రీ తుంబురీశ్వర దేవాలయం కాకతీయుల కాలంలోనే నిర్మితమైందని, శిలాశాసనాలు క్రీస్తుశకం 11వ శతాబ్దానికి చెందినవని ఆలయ శిలా శాసనాలు తెలుపుతున్నాయన్నారు. బహిప్రాంగణంపై సంస్కృతిని కనువిందు చేస్తున్నట్టుగా చుట్టు శిల్ప స్తంభాలు ఉన్నాయి. 09వ తేదీన రుద్రాభిషేకం, వ్యూహ వచనము కలశ స్థాపన శకట ఉత్సవం సాయంత్రం బండ్లు బోనాలు నిర్వహిస్తారు. 10వ తేదిన స్వామివారికి రుద్రాభిషేకము పుష్పార్చన శకట ఉత్సవం పాచీ బండ్లు నిర్వహిస్తారు. 11వ తేదీన బిల్వార్చన రుద్రాభిషేకం పల్లకి సేవ నిర్వహించడం జరుగుతుంది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి కుస్తీ పోటీలు నిర్వహించడం జరుగుతుంది. రాత్రి పార్వతి పరమేశ్వర రథోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. 12వ తేదీన పార్వతి పరమేశ్వరులకు కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. నిత్య భజన సంకీర్తనలు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలకు మాధవానంద సరస్వతి స్వామి, రంగంపేట పీఠాధిపతులు, పూ"పా" రాజయోగి వెంకటస్వామి ఆత్మనంద ఆశ్రమం రుస్తుం పేట పీఠాధిపతులు హాజరవుతారని ఆలయ పూజారి రవికోటి వైద్య రామశర్మ ఆలయ కమిటీ భక్త బృందం తెలియజేశారు.

అక్కానిపల్లి పాఠశాలకు 40 టేబుల్స్, బెంచీల పంపిణీ



నవతెలంగాణ -జోగిపేట
రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ సహకారంతో జోగిపేట లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఆందోల్ మండల పరిధిలోని అక్కానిపల్లి మోడల్ స్కూల్ కు 40 టేబుల్స్ బెంచిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ మాజీ గవర్నర్ సంపటిబండ్ల, అధ్యక్షులు బాలకోటి రెడ్డి, ఉపాధ్యక్షులు విజయలక్ష్మి, కార్యదర్శి రాజా కిషన్, డైరెక్టర్ లక్ష్మారెడ్డి, లయన్స్ క్లబ్ జిల్లా కార్యదర్శులు డాక్టర్ కే .అనంతరెడ్డి, ఆకుల రాంబాబు, క్లబ్ అధ్యక్షులు అల్లే శ్రీకాంత్, కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, మాజీ అధ్యక్షులు హరి నారాయణ వర్మ, యశ్వంత్ రెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు పి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

శివ్వాయిగూడెంలో మాజీ జడ్పీటీసీ ఆర్థికసాయం



నవతెలంగాణ-శివ్వంపేట
మండల పరిధిలోని లచ్చిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ మధిర గ్రామమైన శివ్వాయిగూడెం తండాలో ఇటీవలే అనారోగ్యంతో మరణించిన కోలా శాంతమ్మ కుటుంబానికి మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త రూ. 5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మాజీ సర్పంచ్ ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, తండా నాయకులు కోలా రాజు, బిక్షపతి, హనుమంతు, బద్దు నాయక్ చేతులమీదుగా శనివారం బాధిత కుటుంబసభ్యులకు రూ.5 వేలను అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ గుప్త మాట్లాడుతూ బాధిత కుటుంబాలను తప్పకుండా ఆదుకుంటానన్నారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో పార్టీలకు అతీతంగా బాధిత కుటుంబాలకు సహకారం అందిస్తున్న మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త శివ్వాయిగూడెం తండాలో ఆర్థికసాయం అందించడం పట్ల ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఢిల్లీలో వికసించి మండలంలో వాడిపోతున్న కమలం



నవతెలంగాణ-నిజాంపేట
ఢిల్లీలో కమలం పార్టీ గెలవడంతో మండల కేంద్రంలో కమలం పార్టీలోని రెండు వర్గాల వారు వేర్వేరుగా సంబరాలు నిర్వహించడం పార్టీ నాయకులు, కార్యకర్తల్లో చర్చనీయాంశంగా మారింది. మాజీ జెడ్పీటిసి వర్గం సాయంత్రం దాదాపు 5 గంటల ప్రాంతంలో పార్టీ కార్యాలయం ముందర టపాకాయలు కాల్చుతూ సంబరాలు నిర్వహించారు. మరో వర్గమైన మండల బీజేపీ అధ్యక్షుల ఆధ్వర్యంలో రాత్రి 7 గంటలకు టపాకాయలు కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు. దీంతో మండలంలో కమలం వాడిపోతున్నదని మండల ప్రజలు చర్చించుకుం టున్నారు.



రెండు వర్గాల వారు వేర్వేరుగా టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకొని కమలం పార్టీలో ఐక్యత లేదనే విషయాన్ని చెప్పకనే చెప్తున్నానే చర్చ జరుగుతుంది. బిజెపి జిల్లా అధ్యక్ష పదవి ఎన్నుకున్నప్పటి కంటే ముందే గ్రూపు వర్గాలు నడుస్తున్నాయని బిజెపి నాయకులే కొందరు చర్చించుకుంటున్నారు. ఏదిఏమైనా వర్గాల వల్ల మండలంలో కమలం వాడిపోతున్నదనే చెప్పొచ్చు.

స్వామివారి సన్నిధిలో కోర్టు జడ్జి సిరి సౌజన్య



నవతెలంగాణ-శివ్వంపేట :
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం చాకరిమెట్ల సహకార ఆంజనేయ స్వామి దేవాలయంలో శని ఏకాదశి సందర్భంగా శనివారం భక్తులు ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పౌండర్ చైర్మన్ భాస్కరరాయుని ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుండే భక్తులు స్వామివారి దర్శనం కోసం అధిక సంఖ్యలో హాజరై ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి పూజలతో పాటు నవగ్రహ పూజలు, శనిప్రదోష పూజలు నిర్వహించి, ఆలయ సన్నిధిలోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయంలో స్వామివారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈఓ శ్రీనివాస్,ఆలయ పౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మ ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో అన్నిరకాల ఏర్పాట్లు చేశారు.

స్వామివారి సన్నిధిలో నర్సాపూర్ జడ్జి
శని ఏకాదశి సందర్భంగా చాకరిమెట్లలో జరిగిన ప్రత్యేక పూజలలో నర్సాపూర్ మున్సిఫ్ కోర్టు ఇంచార్జి జడ్జి సిరి సౌజన్య శనివారం ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ మర్యాదలతో జడ్జి సిరి సౌజన్యకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం జడ్జి ఆంజనేయ శర్మ స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



నవతెలంగాణ-నిజాంపేట
మండల కేంద్రానికి చెందిన బీమ్ రావు పల్లి శ్రావణ్‌కు రూ.60 వేలు, చిన్నపైడి శోభారాణికి రూ.15వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రులలో శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ప్రభుత్వం అందజేయడం బాధితులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేయించిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంజా మహేందర్, ఎండి నసీరుద్దీన్, వై వెంకటేశం, పెద్ద పైడి రాజిరెడ్డి, తీగల రాజేందర్ గౌడ్, కె రాములు , కె లక్ష్మణ్, భూమా గౌడ్, భీమ్రావుపల్లి వెంకటయ్య, చిన్నపైడి రవీందర్ రెడ్డి, పాల్గొన్నారు.

ఢిల్లీ ఫలితాలతో బీజేపీ సంబరాలు









నవతెలంగాణ-మనోహరాబాద్
దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించడంతో మండలంలోని కళ్లకల్‌లో బిజెపి శ్రేణులు విజయోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. రాష్ట్ర సర్పంచ్ల ఫోరం ఉపాధ్యక్షులు, మాజీ సర్పంచ్ నత్తి మల్లేష్ ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ నత్తి లావణ్య ముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్‌ల ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. బాణాసంచ కాలుస్తూ మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు కమ్మరి నరేందర్ చారి, గ్రామ అధ్యక్షులు కొత్తూరు మల్లేష్,ప్రభాకర్ గౌడ్,బూత్ అధ్యక్షులు ఎల్లేష్ యాదవ్ ఈరక్క గోపాల్ మాజీ సర్పంచ్ ఐలయ్య యాదవ్ శ్రీశైలం యాదవ్ నర్సింలు ముదిరాజ్ ఆంజనేయులు యాదవ్ సీనియర్ నాయకులు ఇంద్రకరణ్ వేణుగోపాల్ రెడ్డి కుమ్మరి నాగరాజు ఎర్ర కృష్ణ, నత్తి నరేష్ ముదిరాజ్, బాలు యాదవ్ యాదగిరి ముదిరాజ్, కుమ్మరి కృష్ణ, నెతికుంట శివరాం, గణేష్,తదితరులు పాల్గొన్నారు

నవతెలంగాణ-తూప్రాన్
డిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు చారిత్రాత్మక విజయమని బిజెపి పట్టణ అధ్యక్షులు భూమన్నగారి జానకిరామ్ గౌడ్ శనివారం తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డు పై భారీ బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల తిరస్కారానికి గురై ఆప్ ఓటమి పాలైందన్నారు. త్వరలో రాబోయే ఎమ్మెల్సీ, మున్సిపల్, జెడ్పీ, గ్రామపంచాయతీ ఎన్నికలలో బిజెపి పార్టీ విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భూమన్నగారి జానకిరామ్ గౌడ్, బండారు దుర్గారాజు యాదవ్, రామునిగారి మహేష్ గౌడ్, కే.అంజనేయులు గౌడ్, తాటి విఠల్, కే.మధుసూదన్ గౌడ్, ప్రింటింగ్ మధు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-వెల్దుర్తి
ఢిల్లీలో బీజేపీ విజయం సాధించిన సందర్భంగా శనివారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు పడిగదాసు ఆధ్వర్యంలో టపాసులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టుకొని విజయో సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అంగడిపేట శ్రీనివాస్ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు శేఖర్ గౌడ్ మండల బీజేవైఎం అధ్యక్షుడు నవీన్ బిజెపి నాయకులు మల్లేష్ బాలకృష్ణ వెంకటేష్ శివరాములు విక్రం నరసింహులు నాగరాజు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-శివ్వంపేట
దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ పార్టీ అఖండ విజయం సాధించడం చారిత్రాత్మక ఘట్టమని బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు పెద్దపులి రవి అన్నారు. శనివారం ఢిల్లీ ఫలితాలపై ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజరంజక పాలనను ఢిల్లీ ప్రజలు విశ్వసించి గత 27 సంవత్సరాల చరిత్రను తిరగ రాశారని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. నేడు దేశంలో జరిగిన ఢిల్లీ ఎన్నికల ఫలితాలే కాదు.. రాష్ట్రంలో స్థానిక సంస్థలకు రాబోయే గల్లీ ఎన్నికలలో కూడ బీజేపీ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. త్వరలో జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలలో కమలం పార్టీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవడం ఖాయమన్నారు.

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్
ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా అత్యధిక స్థానాలు గెలుపొందడంతో బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం సంబరాలు మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా నాయకుడు శ్రీపాల్ మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీలో బిజెపి గెలుపొందడం, రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు శ్యాంసుందర్, ఉపాధ్యక్షుడు రూపేందర్, బిజెపి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-జోగిపేట
ఢిల్లీలో బిజెపి ఘనవిజయం సాధించిన సందర్భంగా ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీ పట్టణంలో బిజెపి అధ్యక్షులు గోపంపల్లి శివశంకర్ ఆధ్వర్యంలో స్థానిక క్లాక్ టవర్ వద్ద బాణాసచాలు కాల్చి , స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్ గౌడ్,సురేందర్, వెంకటేశం, గాజుల అనిల్, ప్రభాత్, ఆంజనేయులు యాదవ్, మండలం అధ్యక్షులు శివచందర్, కలీమ్, సంగయ్య,పాపయ్య నగేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు తీర్పుపై నిర్లక్ష్యం తగదు

-సీపీఐ గజ్వేల్ కార్యదర్శి శివలింగ కృష్ణ

నవతెలంగాణ-గజ్వేల్



మల్లన్న సాగర్ ప్రాజెక్టులో భాగంగా ప్రాజెక్టులో భాగంగా భూ నిర్వాసులైన వితంతు మహిళలను ఒంటరి మహిళలను కుటుంబంగా గుర్తించి ప్యాకేజీ ఇవ్వాలని ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అధికారులు అమలు చేయాలని గజ్వేల్ నియోజకవర్గం సీపీఐ పార్టీ కార్యదర్శి శివలింగ కృష్ణ కోరారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ మల్లన్న సాగర్ ముప్పు గ్రామాల్లో ఎటిగడ్డ కిష్టాపూర్, పల్లె పహాడ్, వేముల గట్టు, ఎర్రవల్లి, సింగారం, లక్ష్మాపూర్, రాంపూర్ గ్రామాల్లో సుమారు 500పైగా ఒంటరి మహిళలు వితంతు మహిళలున్నారని తెలిపారు. వారికి కుటుంబంగా గుర్తించి ప్యాకేజీ యాలని హైకోర్టు తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. ఆ కోర్టు తీర్పును తక్షణమేఅమలు చేయాలని, ఇప్పటికే గజ్వేల్ ఆర్డీఓ ఆఫీసులో ఉన్నటువంటి సుమారు 100 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేసి అర్హులైన ముప్పు గ్రామ ప్రజలకు అందించా లని, బాధితుల పక్షాన కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బట్టు దయానం దరెడ్డి, జిల్లా కౌన్సిలునెంబర్ స్వర్గం రాజేశం, సీపీఐ పార్టీ నాయకులు పోచయ్య, రాజం, బిక్షపతి పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన గట్ల మల్యాల విద్యార్థులు

నవతెలంగాణ-నంగునూరు



68వ ఎస్జీఎఫ్ఐ జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు నంగునూరు మండలం గట్ల మల్యాల విద్యార్థులు ఎంపికయ్యారు. జనవరి 29, 30, 31 తేదీల్లో మెదక్ జిల్లాలోని తూప్రాన్‌లో జరిగినటువంటి 68వ ఎస్జీఎఫ్ఐ అండర్ -14 సాఫ్ట్ బాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు గట్ల మల్యాల ఉన్నత పాఠశాలకు చెందిన బి. ఈశ్వరి (8 వ తరగతి), డి.అను(9 వ తరగతి) ఎంపికయ్యారు. ఈ విద్యార్థులు ఈనెల 13 నుంచి 16 వరకు మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. రమేశ్ తెలిపారు. ఈ విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, ఆప్ కమిటీ చైర్మెన్, గ్రామ పెద్దలు అభినందించారు. వీరికి శిక్షణ ఇచ్చినటువంటి వ్యాయామ ఉపాధ్యాయులు డి.రాజ్ కుమార్ సైతం అభినందించారు.

బాధితురాలి కుటుంబానికి ఎల్ఓసీ అందజేత



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండలం కడవేరుగు గ్రామం నిరుపేద కుటుంబానికి చెందిన పొన్నం నర్సవ్వ వెన్నుపూస సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా వైద్యానికి పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం పడగ స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఆ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ బీసీ సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించి రూ.2 లక్ష 50వేలు ఎల్ఓసీని మంజూరు చేయించారు. మంజూరు అయిన ఎల్ఓసీ పత్రాన్ని శనివారం బాధిత కుటుంబానికి కిరణ్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ ఉడుముల రెడ్డి, గదరాజు ప్రసాద్, యూత్ అధ్యక్షుడు నీరటి విజయ్, ఎండీ.నాజర్, జల్లి శివకుమార్, జల్లి ముత్తయ్య, బాగోతం పరమేశ్వర్, గదరాజు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు

ఎంఆర్ఓను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-ములుగు



ములుగు మండల నూతన తహసీల్దారుగా షేక్ ఆరీఫా ఇటీవల భాధ్యతలు తీసుకున్న విషయం తెలిసిందే శనివారం ములుగు మండల బీఆర్ఎస్ నాయకులు పులబోయిన అశోక్, వీరన్నగారి స్వరూప రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం తహసీల్దారుకు మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపి శాలువతో సన్మానించారు.

గీతా పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులుగా పల్లె

నవతెలంగాణ-సిద్దిపేట



పట్టణంలోని గీతా పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పల్లె లాల్ బహదూర్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా మార్క శ్రీనివాస్ గౌడ్, సెక్రెటరీగా పల్లె బాలకృష్ణ గౌడ్, కోశాధికారిగా గాధగోని కిష్టయ్య గౌడ్, డైరెక్టర్లుగా గాధగోని సత్యం గౌడ్, పల్లె సునీల్ గౌడ్, గాదగోని ప్రకాష్ గౌడ్, పల్లె జ్యోతి గౌడ్, బాలగోని బుచ్చవ్వలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని పలువురు కుల పెద్దలు సన్మానించారు.

జగ్గు మల్లారెడ్డికి ఘన సన్మానం



నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్రంలో ఇటీవల హైదరాబాదులో (బిస్మాట్)బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియే షన్ ఆఫ్ తెలంగాణ నూతన సంఘానికి స్టేట్ జనరల్ సెక్రెట రీగా జగ్గు మల్లారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని స్టీఫెన్ హైస్కూల్లో మల్లారెడ్డిని ఘనంగా సన్మానించారు. స్టీఫెన్ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు మల్లారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిస్మాట్ జిల్లా ప్రతినిధులు భగవాన్ రెడ్డి, సికిందర్, స్టీఫెన్ పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, కరస్పాం డెంట్ స్వామిదాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ ర్యాలీకి తరలిన బీజేపీ శ్రేణులు



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని దేవక్కపల్లి స్టేజ్ వద్ద కరీంనగర్, మెదక్, నిజామాబాద్, అదిలా బాద్ పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి బీజేపీ మండలాధ్యక్షుడు కొలిపాక రాజు, కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి మహిపాల్ అధ్వర్యంలో శుక్రవారం బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కరీంనగర్ జిల్లాలో ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి నామినేషన్ ప్రక్రియ ర్యాలీకి తరలివెళ్లారు.

తెలంగాణ ఉద్యమకారుడు లక్ష్మణ్‌కు పితృ వియోగం

నవతెలంగాణ-మిరుదొడ్డి



తెలంగాణ ఉద్యమకారుడు అమరవీరుడు వల్లకొండ లక్ష్మణ్ రెడ్డి తండ్రి వల్లకొండ భూంరెడ్డి (70) మరణించారు. మలిదశ ఉద్యమంలో రిపోర్టర్‌గా పనిచేస్తూ తన కలాం ద్వారా తెలంగాణ సమాజాన్ని మేలుకొలుపుతూ తెలంగాణ కొరకు అమరుడైన వ్యక్తి వల్లకొండ లక్ష్మణ్. తన కొడుకు వీరమరణాన్ని చూసి తట్టుకొని నిలబడిన తండ్రి వల్లకొండ భూంరెడ్డి రాత్రి చనిపోవడంతో మిరుదొడ్డి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

19న సాయంత్రం సిద్దిపేటలో భారీ బైక్ ర్యాలీ

-జిల్లా హిందూ వాహిని అధ్యక్షుడు బస్వరాజు సత్యం

నవతెలంగాణ - సిద్దిపేట



చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఈనెల 19న సాయంత్రం సిద్దిపేటలోని రేణుక ఎల్లమ్మ గుడి నుంచి సిద్దిపేట పురవీధుల గుండా శివాజీ విగ్రహం వరకు భారీ బైక్ ర్యాలీ ఉంటుందని హిందు వాహిని జిల్లా అధ్యక్షుడు బస్వరాజు సత్యం తెలిపారు. శనివారం సిద్దిపేట శివాజీ విగ్రహం వద్ద ఆయన హిందూ వాహిని కార్యకర్తలతో కలిసి కరపత్రాన్ని విడుదల చేసి మాట్లాడారు. ర్యాలీ అనంతరం శివాజీ చౌక్ వద్ద భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి హిందువులందరూ భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఉదయం 11 గంటలకే ర్యాలీ అని సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వారికి హిందూవాహినీతో ఎలాంటి సంబంధం లేదని తెలిపారు.

పాత సామాన్ల పేరుతో పంగనామాలు

- తుప్పు పట్టిన ఇనుముతో కోట్లు గడిస్తున్న వ్యాపారులు

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పాత సామాన్ల పేరిట అటు అధికారులకు, ఇటు ప్రజలకు పంగనామాలు పెడుతున్న వ్యాపారస్తులు. తనిఖీ చేయాల్సిన అధికారులు అటువైపు కనీసం తల కూడా తిప్పడం లేదు. తమ దగ్గరకు తెచ్చిన ఇనుము, ప్లాస్టిక్ తదితర వస్తువులను ఇవి దొంగతనం చేసి తీసుకొచ్చారా, లేక వారి సొంత వస్తువుల అని ఆరా తీయకుండా కొనుగోలు చేస్తున్నారు. రైతులు పొలాల్లో ఏర్పాటు చేసిన స్టార్టర్, మోటర్లు, కొందరు వ్యక్తులు అపహరణ చేసి వాటి నుంచి రాగి వైరు, ఇత్తడి ప్లేట్లు, తీసుకువచ్చి పాత సామాను దుకాణాల వారికి అమ్ముతున్నారు. వారు అవి దొంగతనం చేసి తీసుకు వచ్చిన వస్తువులని తెలిసినా దర్జాగా కొంటున్నారు. పాత వాహనాలను సరైన పత్రాలు లేకుండా కొంటున్నారు. వాటిని భాగాలుగా విభజించి అమ్మేస్తున్నారు. మరి కొందరు ప్రబుద్దులు గ్రామాలలో విద్యుత్ స్తంభాలకు ఉన్న వైర్‌ను కట్ చేసి, పాత సామాన్ల దుకాణాలకు అమ్ముతున్నారు. బైక్, కార్, బస్, లారీ, కాదేది అనర్హం పాత సామాన్లు కొనుగోలు చేసి విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు తూనికలు, కొలతలు అధికారులు తనిఖీలు మర్చిపోయారు. లేబర్ యాక్ట్ అధికారులు ఇక్కడ పనిచేయడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు వాపోతున్నారు



ఫీజుల కోసం వేధించిన పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

-ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి బత్తుల అభిషేక్ భాను

నవతెలంగాణ-సిద్ధిపేట

పట్టణంలోనీ సహస్ర పాఠశాలలో చదువుతున్న మినేష్, యశితలను ఫీజు కట్టలేదని విద్యార్థి ఇంటికి ఎప్పటిలా బస్సు పంపలేదని, స్కూలు ఎదుట నిలబెట్టారని ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి బత్తుల అభిషేక భాను అధికారులను కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెల్లించాల్సిన ఫీజు మొత్తం చెల్లించి, టీసీ తీసుకుపోవాలని తల్లిదండ్రులకు యాజమాన్యం సూచించారని, విద్యా ఏడాది చివరి దశలో పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులతో అలా మాట్లాడడం సరికాదన్నారు. ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకు వెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు అజయ్, అరుణ్, సాయికుమార్, విష్ణు, తేజ, నవదీప్, తదితరులు పాల్గొన్నారు.



గంజాయి కేసులో ఆరుగురు నిందితులు అరెస్టు

- 508 గ్రాముల గంజాయి స్వాధీనం

నవతెలంగాణ-నంగునూరు



గంజాయి కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసి, 508 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను వెల్లడించారు. రాజగోపాల్ పేట ఎస్సై అసీఫ్, చిన్న కోడూరు ఎస్సై బాలక్రిష్ణతో కలిసి మాట్లాడుతూ.. నంగునూరు మండలానికి చెందిన నాయిని రాజశేఖర్ రెడ్డి గూగులోతు ప్రవీణ్, నాయిని రాంరెడ్డి, అలకుంట్ల రాకేశ్, గూగులోతు రాజకుమార్, సిద్దిపేట మండలానికి చెందిన రొంపల్లి నరేశ్‌లు ఈ నెల 7న మధ్యాహ్నం 1 గంటల సమయంలో రాంపూర్ ఎక్స్ రోడ్ బస్టాండ్ వెనకాల గల ఖాళీ స్థలంలో గంజాయి విక్రయిస్తున్నారని, తాగుతున్నారని, నమ్మదగిన సమాచారము రాగా అసీఫ్, సిబ్బందితో అక్కడికి వెళ్లారన్నారు. ఆ ఆరుగురు వ్యక్తులు గంజాయి పడేస్తూ పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. వెంబడించి పట్టుకొని విచారించగా వారిలోని ఇద్దరు వ్యక్తులు నాయిని రాజశేఖర్ రెడ్డి, గుగులోతు ప్రవీణ్‌లు గత కొద్ది కాలంగా ఆసిఫాబాద్ జిల్లా కెరిమేరి మండలంకు చెందిన రవి అలియాస్ జాదవ్ సందీప్ దగ్గర కేజీకి రూ.10వేల చొప్పున రెండు కిలోలు కొనుగోలు చేశామని అంగీకరించినట్లు చెప్పారు. అట్టి గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లు చేసి ఒక ప్యాకెట్ రూ.900 చొప్పున మిగతా నలుగురికి అమ్ముతున్న క్రమంలో రాజగోపాల్ పేట పోలీసులు వెళ్లి పట్టుకోవడం జరిగిందని పేర్కొన్నారు. వారి అందరి దగ్గర మొత్తం 508 గ్రాముల గంజాయిని, రెండు మోటార్ సైకిళ్లు, ఐదు సెల్ ఫోన్లు, రూ.3600 డబ్బులను స్వాధీనం పరుచుకొన్నట్లు తెలియజేశారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపించడం జరిగిందని సీఐ వివరించారు.

గ్రామాల్లో స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

- మండలానికి మూడు కోట్ల అభివృద్ధి నిధులు మంజూరు
- బుస్సాపూర్‌లో బీరప్ప, గౌడ సంఘం పనుల సందర్శన
- కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో పోటీ చేయనున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతున్నట్లు, కార్యకర్తలు స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి పూజల హరికృష్ణ అన్నారు. శనివారం మండల పరిధిలోని బుస్సాపూర్ గ్రామంలోని బీరప్ప అలయానికి రూ.5 లక్షలు, గౌడ సంఘం ప్రహరీకి రూ.5 లక్షలు మంజూరైన సందర్భంగా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అనతరం ఇప్పటివరకు సిద్దిపేట రూరల్ మండలానికి మూడు కోటకు పైగా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సొంత మండలం అయినప్పటికీ నేటికీ మండలం అభివృద్ధి చెందలేదు అన్నారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు విన్నవిస్తూ పంచాయతీ ఎన్నికలకు ముందుకు సాగుతామన్నారు. త్వరలో మరింతగా అభివృద్ధి పనులు చేపట్టి గ్రామాలలో సర్పంచ్ అభ్యర్థులను ఏకగ్రీవం రికార్డు సృష్టిస్తామన్నారు. స్థానిక ఎన్నికలలో బీఆర్ఎస్ మోసాలను ఎండగడుతూ ప్రజల పాలన వైపు అడుగులు వేయాలని నాయకులకు కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మంద పండు, అధికార ప్రతినిధి ముతాల బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ సదాశివారెడ్డి, సీనియర్ నాయకులు కలిముద్దీన్, యాదయ్య, కిషన్ ఆంజనేయులు, కనకయ్య, మల్లేశం, గ్రామ ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంతగా ముగిసిన నవోదయ పరీక్ష

నవతెలంగాణ-వర్గల్



జవహర్ నవోదయ విద్యాలయ వర్గల్ సిద్దిపేట జిల్లాలో 2025 -26 విద్యా సంవత్సరానికై 9, 11వ తరగతిలోని పరిమిత ఖాళీల భర్తీకై నిర్వహించిన ప్రవేశ ఎంపిక పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసిందని విద్యాలయ ప్రిన్సిపాల్ డి. రాజేందర్ అన్నారు. 11వ తరగతి ప్రవేశ పరీక్షకు 1621లో 1114 మంది హజరైనారు. 9వ తరగతి పరీక్షకు 989లో 563 మంది హాజరయ్యారు. దీంతో హాజరు శాతము 56.93శాతం. గజ్వేల్, ప్రజ్ఞాపూర్, జవహర్ నవోదయ విద్యాలయ, వర్గల్ ఏర్పాటు చేసిన అన్ని పరీక్ష కేంద్రాలను నాయక్ తహసీల్దారులైన భార్గవ్ రామ్ నాయక్, భాస్కర్ ఫ్లయింగ్ స్క్వాడ్ రూపంలో సందర్శించి, పరీక్ష నిర్వహణపై సంతృప్తిని వ్యక్తం చేశారు. అదే విధంగా గజ్వేల్ మండల విద్యాధికారి కూడా అన్ని పరీక్ష కేంద్రాలను సందర్శించారు. ఈ ప్రవేశ ఎంపిక పరీక్ష సజావుగా జరిగేందుకు మొదటి నుంచి సహకరిస్తున్న ఉమ్మడి మెదక్ జిల్లా సంబంధిత విద్యాధికారులకు, ప్రిన్సిపాల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

యువతను ప్రోత్సహించేందుకు గ్రామీణ క్రీడలు

నవతెలంగాణ-సంగునూరు

క్రీడల్లో గ్రామీణ ప్రాంత యువతను ప్రోత్సహించాలనే ముఖ్య ఉద్దేశంతో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు సిద్దిపేట ప్రాంతాన్ని ఒక క్రీడ హబ్‌గా తీర్చిదిద్దారని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఎడ్ల సోమిరెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ కోల రమేశ్ గౌడ్‌లు పేర్కొన్నారు. మండల కేంద్రంలో నల్ల పోచమ్మ రోడ్డులో ఏర్పాటు చేసిన క్రికెట్ గ్రౌండ్‌లో కేసీఆర్ జన్మదినం సందర్భంగా మండల స్థాయి కేసీఆర్ క్రికెట్ ట్రోపిలో భాగంగా టీమ్‌ల వారిగా డ్రా తీసే కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, గెలిచిన వారు పై స్థాయిలో గెలుపే లక్ష్యంగా, ఓడిన వారు రేపటి గెలుపు దిశగా ఐక్యమత్యంతో ముందుకు సాగాలని తెలిపారు. రాష్ట్ర దేశ స్థాయిలో యువత క్రీడల్లో రాణించి మండలానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగు మహేశ్, సీనియర్ నాయకులు రాజిరెడ్డి, సంగు పురేందర్, జైపాల్ రెడ్డి, మహేందర్ గౌడ్, మల్లేశం పలువురు నాయకులు పాల్గొన్నారు.



గజ్వేల్ మున్సిపల్‌ను కాంగ్రెస్ ఖాతాలో వేస్తాం

- త్వరలోనే గజ్వేల్‌లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన
- డీసీసీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ మున్సిపల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేసి సీఎం రేవంత్ రెడ్డికి బహుమతిగా ఇస్తామని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని ఒకటో, రెండో వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ జెండా పండుగ నిర్వహించిన సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ..మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న వివిధ ప్రజా సంక్షేమ పథకాలపై ప్రజలను చైతన్యం చేయాలని స్పష్టం చేశారు. త్వరలోనే గజ్వేల్ లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఉన్నట్లు తెలిపారు. ముఖ్యంగా గత పాలకుల తప్పిదాల ఫలితంగా డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో అక్రమాలు చోటు చేసుకోగా, సరిచేసి అర్హులకు ఇవ్వాలని కలెక్టర్ దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు పంపిణీ చేస్తుండగా, ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన చేపట్టడంతో ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నట్లు విమర్శించారు. ఈ సందర్భంగా రెండో వార్డు అధ్యక్షులుగా మల్లారెడ్డి, రెండో వార్డ్ కాంగ్రెస్ అభ్యర్థిగా కప్ప మహేష్ ను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అంక్షారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులను తగ్గించడం అన్యాయం

- మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య

నవతెలంగాణ-సిద్దిపేట

కుల గణనలో తమను తక్కువ సంఖ్యలో చూపించి మున్నూరు కాపులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసం చేశారని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య ఆరోపించారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మున్నూరు కాపు సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కుల గణన ద్వారా బీసీలు 42 శాతం ఉన్నారని, అందులో మున్నూరు కాపులు 8 శాతం మాత్రమే అనడం పూర్తిగా అవాస్తవం అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మున్నూరు కాపులు 18 శాతం ఉన్నారని ప్రకటించిందని గుర్తు చేశారు. ఆర్థిక, సామాజిక, రాజకీయపరంగా మున్నూరు కాపులు ఎదిగితే ఓర్వలేని కొంతమంది కావాలనే తమను తక్కువ సంఖ్యగా చూపుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సర్వే మళ్ళీ నిర్వహించి ప్రభుత్వం కులాల లెక్కలను సరిగా ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మున్నూరు కాపులంతా ఏకమై పోరాటం చేస్తామని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ధర్నా చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో మున్నూరు కాపు సంఘం నాయకులు హరి శంకర్, పూర్ణ చంద్ర శేఖర్, సతీష్ కుమార్, శ్రీనివాస్, బాలయ్య పాల్గొన్నారు.



ఘనంగా పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవ వేడుకలు





నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం పాలమాకుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. పాఠశాలలో పై తరగతి చదువుతున్న విద్యార్థులు తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు భోదించారు. ప్రధానోపాధ్యాయురాలుగా కె.అక్షయ, డీఈఓగా వి.బన్నీ, డిప్యూటీ డీఈవోగా పి. భార్గవ్, పీడీగా చరణ్, ఉపాధ్యాయులు గా ఉషా, లాస్య, రిశ్వంత్, ప్రవల్లిక, రక్షిత, తదితరులు వ్యవహరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు పోతుగంటి ప్రభాకర్ రావు,ఉపాధ్యా యులు ఎం.డి మహబూబ్ అలీ, తదితరులు పర్యవేక్షించా రు. భోదనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

నర్మెట ప్రాథమిక పాఠశాలలో..నంగునూరు మండలం నర్మెట ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు భోదించారు. జిల్లా విద్యాశాఖాధికారి గా శరణ్య, మండల విద్యాశాఖాధికారిగా సుష్మ, ప్రధానోపాధ్యాయులుగా సాయి కృతిక్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులుగా నాగరాజు, ఎంఎన్ఓగా నిశాంత్, మరికొంత మంది ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎనగందుల మనీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశం లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మండల విద్యాశాఖాధి .కారి తగిరెడ్డి దేశిరెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తహసీన్ సుల్తానా, అర్షద్, యాదగిరి, సునీత, లలిత, శ్రావణ్‌లు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేట: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి విధులు నిర్వహించారు. డీఈవోగా మృదులయ, డిప్యూటీ డీఈవోగా సాయిస్తా, ఎంఈఓగా సాత్విక వ్యవహరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోహర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల ద్వారా గురువుల బాధ్యతలు, పాఠాలు బోధించడంలో అనుభవాలను విద్యార్థులకు గుర్తుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ ఉదయ శ్రీ, ఉపాధ్యాయులు అశోక్ రెడ్డి, ఉజ్వల, ప్రభు, తదితరులు పాల్గొన్నారు.



పలు మండలాల్లో బీజేపీ నాయకుల సంబరాలు







నవతెలంగాణ-తొగుట

రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం అన్నారు. శనివారం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి విజయం సాధించడం పట్ల పార్టీ నాయకులతో కలిసి మండల కేంద్రంలో టపాసులు పేల్చి స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీజేపీ పవ నాలు విస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ పతనం అవుతుందన్నారు. ఢిల్లీ గద్దపైన 27 ఏండ్ల తర్వాత మళ్లీ ఢిల్లీలో బీజేపీ భారీ మెజార్టీ సాధించి గొప్ప విషయం అన్నారు. రానున్న ఎన్నికలలో కూడా బీజేపీ అభ్యర్థులు ముగ్గురు ఎమ్మెల్సీ సీట్ల ను బీజేపీ కైవసం చేసుకుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే స్థానిక సంస్థల ఎలక్షన్లలో కూడా బీజేపీ నాయకులే గెలుసారని ధీమ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కంక ణాలు నర్సింలు, మాజీ సర్పంచ్ బొడ్డు నర్సింలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-రాయపోల్: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ భారీ మెజార్టీతో విజయం సాధించడం పట్ల పార్టీ హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీకి ఢిల్లీ ప్రజలు గాడిద గుడ్డే మిగిలిందని రాయపోల్ బీజేపీ మండల అధ్యక్షులు మంకిడి స్వామి అన్నారు. శనివారం మండల కేంద్రంలో టపాసులు పేల్చి స్వీట్లు పంచుకుని సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీ గద్దపైన 27 ఏండ్ల తర్వాత మళ్లీ బీజేపీ భారీ మెజార్టీ సాధించి ఆమ్ ఆద్మీ పార్టీని మట్టి కల్పించింది. అలాగే స్థానిక సంస్థల ఎలక్షన్లలో బీజేపీ నాయకులే గెలుస్తారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు భాస్కర్ రెడ్డి, నీల స్వామి, మధుసూదన్ రెడ్డి, సంతోష్ రెడ్డి, నరేష్ గౌడ్,లక్ష్మణ్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందడంతో గజ్వేల్ పట్టణంలో ఆ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించు కున్నారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో బాణా సంచలు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జశ్వంత్ రెడ్డి, గురువారెడ్డి, మున్సిపాలిటీ నాయకులు మనోహర్ యాదవ్, అశోక్ గౌడ్, రాములు, అరవిందు, సురేష్ గౌడ్, మధు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
ఆదివారం | 09 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com

సమాజ భాగస్వామ్యంతో పాఠశాలలు పటిష్టం

-పేద విద్యార్థులకు అండగా ఐటీ ఉద్యోగి

నవతెలంగాణ-కొండపాక



ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలతో పాటు సమాజ భాగస్వామ్యంతో పాఠశాలలు పటిష్టమవుతాయని కొండపాక కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు శ్రీనివాస్ అన్నారు. కొండపాక గ్రామానికి చెందిన ఐటీ ఉద్యోగి మంచాల శ్రీనివాస్ తన తండ్రి బాలయ్య జ్ఞాపకార్థం కొండపాక ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 80 మంది విద్యార్థులకు సుమారు రూ.32 వేల విలువైన స్పోర్ట్స్ డ్రెస్సులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడారు. సేవా గుణం ప్రతి ఒక్కరికి ఉండాలని సేవలోనే సంతృప్తి కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుడిమల్ల శ్రీనివాస్ గౌడ్,ఏపీసీ చైర్మెన్ నవ్యశ్రీ, ఉపాధ్యాయులు ఎ.పరమేశ్వర్ రెడ్డి, పి.యాదగిరి, ఎల్.అనిత, ఎ.స్వామి, ఏ.భార్గవి, పి.లక్ష్మి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాపార పరంగా మరింత అభివృద్ధి చెందాలి

నవతెలంగాణ-గజ్వేల్



వ్యాపార పరంగా గజ్వేల్ మరింత అభివృద్ధి చెందాలని ఆత్మ కమిటీ మాజీ చైర్మెన్ ఊడెం కృష్ణారెడ్డి అన్నారు. శనివారం గజ్వేల్ పట్టణంలోని వార్డులో సిబాస్ ఫిష్ మార్ట్ ప్రారంభోత్సవ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది ఏండ్లుగా కేసీఆర్ నాయకత్వంలో గజ్వేల్ నియోజకవర్గం వ్యాపార పరంగా అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా గజ్వేల్ అభివృద్ధిని పట్టించుకోలేదని అన్నారు. ప్రస్తుతం గజ్వేల్ పట్టడానికి సిభాస్ ఫిష్ మార్ట్ రావడం స్థానికంగా వినియోగదారులకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో 19 వార్డు తాజా మాజీ కౌన్సిలర్ గుంటుక శిరీష రాజు, మర్కుకు మాజీ జెడ్పీటీసీ రామచంద్రం, సింగల్ చైర్మెన్లు వెంకటేశం గౌడ్, ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ అవినీతిపై సీఎంను కలుస్తాం



నవతెలంగాణ-దుబ్బాక

మున్సిపల్‌లో జరిగిన అవినీతి, అక్రమాలపై త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డిని కలుస్తామని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ (సీసీఆర్) ప్రతినిధులు గుండ్ల శివప్రసాద్, అశోక్ కుమార్ కాకర్ల తెలిపారు. రికార్డుల నిర్వహణ సరిగా లేదని, అధికారులు దాటవేసే సమాధానమిస్తున్నారని, భారీగా ప్రభుత్వ నిధులను తమ జేబుల్లోకి మళ్లించుకున్నారని ఆరోపించారు. ఫైళ్ళ తనిఖీలో భాగంగా రెండో రోజైన శనివారం దుబ్బాకలోని మున్సిపల్ కార్యాలయంలో సీసీఆర్ సభ్యులతో కలిసి విలేకరులతో వారు మాట్లాడారు. 2020-25 వరకు దుబ్బాక మున్సిపల్‌లో టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల్లో భారీగా అవినీతి, అక్రమాలు జరిగినట్లు తమ తనిఖీలో గుర్తించమన్నారు. త్వరలోనే జిల్లా కలెక్టర్, సీఎం, గవర్నర్, రాష్ట్ర మున్సిపల్ కార్యాలయంలో పూర్తి నివేదికను అందిస్తామని, అవినీతి అక్రమాలపై విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకునేలా సీసీఆర్ తరఫున పోరాడుతామని స్పష్టం చేశారు. సీసీఆర్ సభ్యులు కరీముద్దీన్, చరణ్ కాంత్, రత్నాకర్, రాజు, గణేష్ పలువురున్నారు.

రోడ్డుపైనే సంత.. సమస్యలతో చింత



- రాకపోకలకు తప్పని ఇక్కట్లు
- కనీస సౌకర్యాలు లేవు..అధికారుల పట్టింపు కరువు..!

నవతెలంగాణ-దుబ్బాక

రోడ్డుపైనే వార సంత (అంగడి) నిర్వహిస్తుండడంతో వాహన దారులు, పట్టణ ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. దుబ్బాక పట్టణ కేంద్రంలో ప్రతీ శనివారం రోడ్డును ఆక్రమించి నలువైపులా సంత నిర్వహిస్తుండటంతో స్థానికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రోడ్లపైనే కూరగాయలు, పండ్లు, చేపలు, దుస్తుల విక్రయాలు చేస్తుండటంతో రోడ్లన్నీ ఇరుకుగా మారి..ఆర్టీసీ బస్సులు, ఆటోలు, లారీలకు అంగడి రోజున ఇబ్బందులు తప్పడం లేదు. అధికారుల పట్టింపు కరువడంతో రాకపోకలకు తిప్పలు తప్పడం లేదు.

రాకపోకలకు తప్పని ఇక్కట్లు..

దుబ్బాక నుంచి లచ్చపేట మీదుగా కామారెడ్డికి వెళ్లే దారిలో, పెద్దచీకోడు మీదుగా కొత్తపల్లి వెళ్లే బైపాస్ రోడ్, బస్టాండ్ నుంచి తెలంగాణ తల్లి విగ్రహ చౌరస్తా మీదుగా ముస్తాబాద్ వెళ్లే దారిలో అంగడి జరిగే ప్రతి శనివారం ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు. రింగ్ రోడ్ లాంటి ప్రత్యామ్నాయ దారి లేకపోవడంతో ప్రధానంగా ఈ మార్గాల గుండానే ఆర్టీసీ బస్సులు, ట్రాన్స్ పోర్ట్ వాహనాలు, ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు భారీ సంఖ్యలో వెళ్తుంటాయి. ట్రాఫిక్‌ను నియంత్రించడంలో మున్సిపల్ అధికారులు పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. మున్సిపల్ అధికారులు ప్రతీయేటా వారంతాపు సంత (అంగడి)ను వేలం పాట ద్వారా నిర్వహిస్తారు. గతేడాది (2024-25) నిర్వహించిన తైబజారు వేలంలో కూరగాయల మార్కెట్ కు రూ.11.10 లక్షలు, పశువుల సంతకు రూ.19.60 లక్షల ఆదాయం మున్సిపాల్టీకి వచ్చింది. సదరు కాంట్రాక్టు దక్కించుకున్న గుత్తేదార్ల నుంచి ముందుగానే కొంతమేర డీడీల రూపంలో నగదును తీసుకుంటున్నా..అందుకు అనుగుణంగా వారాంతపు అంగడిలో కనీస వసతుల ఏర్పాట్లు, మౌలిక సౌకర్యాలు కల్పించడం లేదు.

సౌకర్యాలు లేక మహిళల ఇబ్బందులు..

మార్కెట్ కు వచ్చే ప్రజల రద్దీకి సరిపడా కనీస అవసరాలైన మూత్రశాలలు లేకపోవడంతో..మరీ ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మాంసం వ్యర్థాలతో దుర్గంధ భరితం..

రోడ్డు పక్కనే చికెన్, చేపల విక్రయ షాపులు ఉండటం, నిర్వాహకులు ఆ చికెన్, చేపల వ్యర్థాలను రోడ్డు పైనే పడేయడంతో ఆ పరిసరాలు దుర్గంధభరితం అవుతున్నాయి. అలాగే తైబజారు నిర్వాహకులు రసీదు ఇవ్వకుండానే విక్రయదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు పలువురు రైతులు, చిరు వ్యాపారస్తులు ఆరోపిస్తున్నారు. తైబజారు నిర్వాహకులను ప్రశ్నిస్తే 'ఎవరికి చెప్పుకొంటారో చెప్పుకోండి' అంటూ బెది రిస్తున్నారని చిరు వ్యాపారులు వాపోతున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారు లు ప్రత్యేక దృష్టి సారించి సంతలో మౌలిక సౌకర్యాలను కల్పించాలని..ట్రాఫిక్ ఇబ్బందులు తెలెత్తకుండా చర్యలు తీసు కోవాలని పట్టణవాసులు కోరుతు న్నారు.





న్యూరో సర్జన్ డాక్టర్ తిరుమల్‌కు విశిష్ట ఆహ్వానం



నవతెలంగాణ-దుబ్బాక

ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ వై.తిరుమల్‌కు విశిష్ట ఆహ్వానం అందింది. దుబ్బాక మున్సిపల్ పరిధి లచ్చపేట పదో వార్డుకు చెందిన ప్రముఖ కవయిత్రి ఎర్రగుంట సుజాత మాజీ ఎంపీటీసీ ప్రసాద్ దంపతుల కుమారుడు వై.తిరుమల్ హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్లో అదనపు న్యూరో సర్జన్‌గా పనిచేస్తున్నారు. ఈనెల ఫిబ్రవరి 13 నుంచి 17 వరకు శ్రీలంకలోని కొలంబోలో, మే 11 నుంచి 14 వరకు లండన్‌లో నిర్వహించే "పీడియాట్రిక్ న్యూరో సర్జరీ" సమావేశాల్లో ఆయన పాల్గొని ప్రసంగించనున్నారు. అరుదైన గౌరవం దక్కడం పట్ల తల్లిదండ్రులు సుజాత ప్రసాద్, లచ్చపేట వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపాలిటీలోని ప్రజలు కాంగ్రెస్ వైపే

-గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ బాబా

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారని, రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో 20 వార్డులు కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకోవడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ పట్టణ సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ బాబా స్పష్టం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండాను ఎగిరేసేందుకు అన్ని వర్గాల ప్రజలు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని, పేర్కొన్నారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజాపాలనను గడపగడపకు తీసుకువెళ్లి, అన్ని వర్గాల ప్రజలకు వివరించి, ప్రజలకు కాంగ్రెస్ పార్టీని చేరువ చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి సొంత ఆస్తులు పెంచుకున్నారని మండిపడ్డారు. ప్రజలు అన్ని గమనించి బీఆర్ఎస్ కు రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడం ఖాయం అన్నారు.

10న బుగ్గ రాజేశ్వర స్వామి దేవాలయంలో వేలంపాట

-ఆలయ చైర్మెన్ బాగన్న గారి కరుణాకర్

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

నారాయణరావుపేట మండల కేంద్రంలో ఉన్న శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 10వ తేదీన ఆలయ 23వ వార్షికోత్సవంతో పాటుగా, మహాశివరాత్రి సందర్భంగా పలు విక్రయాలు, వసూళ్లకు బహిరంగ వేలం పాటను నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మెన్ బాగన్న గారి కర్ణాకర్, ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీధర్ లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10న మధ్యాహ్నం 1 గంటలకు దేవస్థానం ఆవరణలో వేలంపాట నిర్వహించడం జరుగుతుందని, కొబ్బరికాయల అమ్మకం కోసం రూ.25వేలు, సైకిల్, బైక్ స్టాండ్ పార్కింగ్ కోసం రూ.10 వేలు, నూనె గురుగులు రూ.10 వేలు, లడ్డు, పులిహోర కోసం రూ.20వేలు ధరావత్తుగా చెల్లించాల్సి ఉంటుందని, మరిన్ని వివరాల కోసం ఆలయంలో సంప్రదించాలని కోరారు.

మహిళ కూలీ అదృశ్యం

-కేసు నమోదు

నవతెలంగాణ-దుబ్బాక



మహిళా కూలీ అదృశ్యమైన ఘటన దుబ్బాక పట్టణ కేంద్రంలో శనివారం జరిగింది. ఎస్ఐ వీ.గంగరాజు తెలిపిన వివరాలు..పట్టణ కేంద్రానికి చెందిన కారంకంటి గంగ (45) అనే మహిళ, కూలీ పని చేస్తూ కూతురితో కలిసి ఉంటుంది. రోజులాగే శనివారం ఉదయం కూలీ పనికి వెళుతున్నానని చెప్పి కనబడకుండా పోయింది. ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లేదు. గంగ కుమార్తె వీణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కెనాల్ ద్వారా నీటిని వెంటనే విడుదల చేయాలి

-బీజేపీ యువ నాయకులు శ్రీరామ్ కనకరాజు

నవతెలంగాణ-గజ్వేల్

కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి సంగారెడ్డి వెళ్లే కెనాల్‌కు నీటిని వెంటనే విడుదల చేయాలని గజ్వేల్ మండలం ధర్మారెడ్డి పల్లి గ్రామానికి చెందిన బీజేపీ యువ నాయకుడు శ్రీరామ్ కనకరాజు అన్నారు. శనివారం గజ్వేల్ మండలం ధర్మారెడ్డి పల్లి గ్రామంలో కెనాల్ వద్ద రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కెనాల్ ద్వారా చెరువులు, కుంటలు నింపడం వల్ల భూగర్భ జలాలు సమృద్ధిగా పెరిగి, పంటలు బాగా పడ్డాయి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కెనాల్ ద్వారా నీరు విడుదల చేయక పోవడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి రైతులకు నష్టం వాటిల్లుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోచయ్య, రమేష్, కిష్టయ్యకళ్యాణ్, రైతులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



నేడే క్రికెట్ టోర్నీ ప్రారంభం

- కేసీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా టోర్నమెంట్
- మండల వ్యాప్తంగా 12 గ్రామాలలో 30 టీంలు



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని సిద్దిపేట అర్బన్ మండలంలో మండల నాయకులు, కేసీఆర్ అభిమానుల ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 17వ తేదీ వరకు కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎద్దు యాదగిరి, పయ్యావుల శ్యామ్, చింతల శ్రీనివాసులు తెలిపారు. శనివారం మిట్టపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 12 గ్రామాల నుంచి 30 టీములు టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయని 17వ తేదీ ముగింపు ఉంటుందని అన్నారు. ప్రారంభం రోజున, ముగింపు రోజున స్థానిక ఎమ్మెల్యే హరీశ్ రావు కార్యక్రమానికి హాజరుకా నున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా యువకులు టోర్నమెంట్‌కు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. విజేతలకు నగదు బహుమతితో పాటు ట్రోఫీని అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు రాము, సంతోష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

హరితహారంపై ప్రత్యేక దృష్టి

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని హరితహారంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు కమిషనర్ గోలుకొండ నరసయ్య అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డులో ఉన్న హరితహారం మొక్కలను పరిశీలించి నీటి పంపినని చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం సమీపిస్తున్న నేపథ్యంలో మున్సిపల్ సిబ్బంది సైతం మున్సిపల్ పరిధిలోని ఉన్న మొక్కలకు నీటిని సప్లై చేయాలని సూచించారు. ఇంటింటి చెత్త సేకరణ చేసే ముందు ప్రజలకు తడి పొడి చెత్త వేరువేరుగా చేసేలా వారికి అవగాహన కల్పించాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను పట్టణంలో నిషేధం చేయడం జరిగిందని చెప్పారు. పట్టణ ప్రజలు వాటిని తగ్గించి జూట్ బ్యాగులను వాడుకోవాలని చూపించారు. మున్సిపల్ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ వెంటనే శుభ్రం చేస్తున్నామని అన్నారు. అదేవిధంగా ఇంటింటికి తిరుగుతూ నల్ల బిల్లులు, ఇంటి పన్నులు వసూలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు విద్యాసాగర్, వేణుల సేవలు మరువలేనివి

- మండల విద్యాశాఖధికారి సత్యనారాయణ రెడ్డి

నవతెలంగాణ-రాయపోల్

వడ్డేపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యాసాగర్, వేణు సుదీర్ఘకాలంగా విద్యార్థులకు విద్యాబోధన చేశారని వారి సేవలు మరువలేనివని రాయపోల్ మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ రెడ్డి అన్నారు. శనివారం ఇటీవల బదిలీపై వెళ్లిన వారికి పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా ఘన సన్మానం చేసి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసాగర్ 12, వేణు 14 ఏండ్లు విధులు నిర్వహించి విద్యార్థులకు విద్యాబోధన చేసి ఎంతోమంది విద్యార్థులను ఆదర్శంగా తీర్చిదిద్దారని, వారు ఎక్కడ పని చేసిన విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేస్తూ మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించగా 5వ తరగతి విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా మిగతా విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. వారిలో డీఈవో, ఎంఈవో, ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులుగా పాత్ర వహించారు. అనంతరం విద్యాసాగర్, వేణు మాట్లాడుతూ పాఠశాలతో విడదీయలేని అనుబంధం ఉందని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అన్నదమ్ములలాగా కలిసిమెలిసి పనిచేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రానున్న కాలంలో కాంగ్రెస్ పార్టీ ఉండదు

- బీఆర్ఎస్ మద్దూరు మండలాధ్యక్షుడు మేక సంతోష్ కుమార్



నవతెలంగాణ-మద్దూరు

రానున్న కాలంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో, కేంద్రంలో ఉండదని బీఆర్ఎస్ మద్దూరు మండలాధ్యక్షుడు మేక సంతోష్ కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని ధర్మారం, సలాక్‌పూర్, గ్రామాల్లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో కేంద్రంలో రానున్న కాలంలో ప్రజలు నమ్మే పరిస్థితి కోల్పోయిందన్నారు. రాష్ట్ర ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పూర్తిగా విస్మరించిందన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్‌లు బాల నరసయ్య, శివగారి అంజయ్య, పచ్చ మడ్ల మానస, నాగేశ్వర రావు, మాజీ వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమ మల్లేశం, సర్పంచ్ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు వంగ భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఊట్ల రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ రచనలు..మానవత్వ దారులు

- ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక సదస్సులో వక్తలు

నవతెలంగాణ-సిద్దిపేట



తెలుగు సాహిత్యంపై అంబేద్కర్ చెరగని ముద్ర వేశారని వక్తలు స్పష్టం చేశారు. సిద్దిపేట విపంచి కళానిలయం(బోయి విజయభారతి ప్రాంగణం)లో శనివారం ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక సదస్సు జరిగింది. తెలుగు సాహిత్యం అంబేద్కర్ ప్రభావం అంశంపై తిరుపతి యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కొలకలూరి మధుజ్యోతి , తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వాధ్యక్షులు డాక్టర్ నందిని సిద్ధారెడ్డి, తెలంగాణ ప్రెస్ అకాడమీ పూర్వ చైర్మెన్ అల్లం నారాయణ, ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల ప్రరవే అధ్యక్షురాలు అనిశెట్టి రజిత, ప్రరవే తెలంగాణ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాత్యాయని విద్మహే, ప్రొఫెసర్ బన్న ఐలయ్య, డాక్టర్ డాక్టర్ కోయి కోటేశ్వరరావు, డాక్టర్ గంధం అరుణ విభిన్న అంశాలపై ప్రసంగించారు. అంబేద్కర్ భావజాలం తెలుగు కథ , నవల , కవిత, నాటకం, పద్య, విమర్శ సాహిత్యాల్లో ప్రస్ఫుటంగా ఉన్నదని సోదాహరణంగా వివరించారు. అంబేద్కర్ సమాన త్వ , మానవత్వ భావాలు తెలుగు రచనలో కనిపిస్తాయని తెలిపారు. అసమానతల నిర్మూలనలో అంబేద్కర్ ప్రభావం ఉన్నదని చెప్పారు. అసమానతలను అధిగమించే చైతన్యం అనివార్యమన్నారు. అంతకుముందు ప్రరవే జాతీయ అధ్యక్షురాలు రజిత పతాకావిష్కరణ చేశారు. 15 వసంతాల ప్రస్థానాన్ని వివరించారు. మంజీరా రచయితల సంఘం అధ్యక్షులు రంగాచారి, ప్రధాన కార్యదర్శి సిద్దంకి యాదగిరి లు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రం ట్ జాతీయ కార్యదర్శి శంకర్, రాష్ట్ర గొల్ల కురుమల సంఘం అధ్యక్షులు శ్రీహరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందించిన ఉపాధి కూలీలు

నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో ఇటీవల మహాత్మా గాంధీ ఉపాధి హామీ పనులు చేస్తుండగా మట్టి దిబ్బలు కూలి ఇద్దరు కూలీలు ప్రాణాలు కోల్పోగా, కొంతమందికి తీవ్ర గాయాలయ్యాలయిన విషయం అందరికీ తెలిసిందే.. వీరంతా నిరుపేద కుటుంబానికి చెందినవారు కావడంతో వారికి ఆర్థిక సాయం అందించాలనే లక్ష్యంతో గౌరవెల్లి గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు అలాగే ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటస్వామి కలిసి రూ.5వేలు స్వచ్ఛందంగా వసూలు చేశారు. ఈ సొమ్మును ఆదివారం వారి కుటుంబానికి అందిస్తామ న్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీ రాధా మాట్లాడుతూ మేమంతా నిరుపేద కుటుంబానికి చెందిన వారమని, గోవర్ధనగిరి ఘటనలో మరణించిన అలాగే గాయపడిన కూలీలు కూడా నిరుపేదలని వారి కుటుంబానికి ఆర్థికంగా మా వంతు సాయం స్వచ్ఛం దంగా అందించామని తెలియజేశారు. అలాగే ప్రతి గ్రామం నుంచి ఉపాధి హామీ పనులు చేసే ప్రతి ఒక్కరూ తలా ఇంత వేసుకొని వారి కుటుంబాన్ని ఆదుకోవాలని విన్నవించారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటస్వామి మాట్లాడుతూ మా గ్రామ ఉపాధి కూలీలు స్వచ్ఛందంగా తలా ఇంత డబ్బులు వేసుకొని రూ.5 వేలు నాకు అందించారని వారు చేసిన సాయం చాలా గొప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలతో పాటు, పలువురు గ్రామస్తులు, తదితరులు, పాల్గొన్నారు.



రాష్ట్ర బడ్జెట్లో విద్యకు 20 శాతం నిధులు కేటాయించాలి

నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర బడ్జెట్లో విద్యకు కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ విద్యా పరిరక్షణ కమిటీ సిద్దిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటి నాయకులు తిరుపతి రెడ్డి, కిష్టయ్య , విజేందర్ రెడ్డి, నరేందర్‌లు మాట్లాడుతూ..అందరికీ విద్య, సమానమైన విద్య, నాణ్యమైన విద్య అందించడం అనేది ప్రజాస్వామిక ప్రభుత్వానికి గీటురాయి, కానీ రాష్ట్రంలో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తానని చెప్పి గద్దెకెక్కిన గత ప్రభుత్వం విద్యారంగానికి నిధులు గణనీయంగా తగ్గించడం వలన ప్రభుత్వ విద్య విధ్వంసం అయిపోయిం దన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడ రాష్ట్రంలో విద్యకు తగిన ప్రాధాన్యత నిస్తాననే వాగ్దానంతో గెలిచారని, కానీ 2024-25 బడ్జెట్లో విద్యకు కేటాయించింది కేవలం 7.3 శాతం మాత్రమేనని అన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలలో విద్యకు కేటాయించిన బడ్జెట్ సగటు 14.7 శాతం లో సగము కన్నా తక్కువేనని అన్నారు. అలాగే మన కాలేజీల్లో, యూనివర్సిటీల్లో మౌలిక వసతులు లేక, వనరులు లేక, బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు లేక విద్యా ప్రమాణాలు అడుగంటి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యకు కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని, అలా కేటాయించిన నిధులు ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి మాత్రమే ఖర్చు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లయ్య, నర్సిములు, మల్లేశం, రాజయ్య, సత్యనారాయణ, రాములు, రాంచంద్రం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ రిజర్వేషన్‌తో మాల కులాలకు అన్యాయం

నవతెలంగాణ-మిరుదొడ్డి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన ఎస్సీ రిజర్వేషన్ ద్వారా మాల, మాలఉపకులాలకు అన్యాయం జరుగుతుందని అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు మద్దెల రాజేశం, దార స్వాములు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదమ్ముల కలిసున్న ఎస్సీలను వర్గీకరణ పేరుతో విభజించి ఓట్లు దండుకోవాలని చూస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు రానున్న రోజుల్లో ఎస్సీలు తగిన గుణపాఠం చెప్తారు అని అన్నారు. నరేంద్ర మోడీ ఎస్సీ వర్గీకరణపై తీసుకున్న నిర్ణయం సరికాదని మండిపడ్డారు మాల ఉపకులాలకు అన్యాయం జరిగిందని తెలిపారు. ఈ నెల 14న రాష్ట్రవ్యాప్తంగా బంద్‌లో ప్రతి ఒక్కరు మాల మాల ఉప కులాలు ఏకమై ఇబ్బందులు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల సంఘం సభ్యులు మద్దెల రోశయ్య ధార మల్లయ్య సుదర్శన్ చంద్రం నక్క రాజయ్య మహేష్ తదితరులు పాల్గొన్నారు.



తీన్మార్ మల్లన్నపై కేసు నమోదు చేయాలి

నవతెలంగాణ-సిద్దిపేట



రెడ్డి సామాజిక వర్గం పట్ల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని, వెంటనే తాను చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు మంగ తిరుమలరెడ్డి, ప్రధాన కార్యదర్శి సద్ది నాగరాజు రెడ్డిలు డిమాండ్ చేశారు. శనివారం రంగదాంపల్లి రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు వంగ తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలో తీన్మార్ మల్లన్నపై కేసు నమోదు చేయాలంటూ పట్టణ మూడో పోలీస్ స్టేషన్‌లో రెడ్డి సంఘం ప్రతినిధులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగతమైన ప్రతిష్ట కోసమో, తన పరపతి పెంచుకోవడం కోసం తీన్మార్ మల్లన్న రెడ్డి సామాజిక వర్గాన్ని టార్గెట్ చేస్తూ అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడం సరైనది కాదన్నారు. వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు అంకిళ్ల వెంకటేశ్వర రెడ్డి , తడిసిన సుమన్ రెడ్డి, అంకిల్ల వేణుగోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.